## లోటస్‌పాండ్ బఫర్ జోన్‌లో నిర్మాణాలు

హైదరాబాద్,జూబ్లీహిల్స్ లోటస్ పాండ్‌లోని బఫర్ జోన్‌లో నిర్మాణాలపై జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిషనర్ ఎ.వి. రంగనాథ్ మండిపడ్డారు. గురువారం లోటస్ పాండ్ పరిసర ప్రాంతాల్లోని నిర్మాణాలను ఆయన పరిశీలించారు. చెరువుల అక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవంటూ భవన నిర్మాణ దారులను ఆయన హెచ్చరించారు. అయితే లోటస్ పాండ్ రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను తొలగించి నిర్మాణ పనులు చేపట్టడంపై ఆయన మండిపడ్డారు. ఇందుకు సంబంధించి పూర్తి స్థాయిలో వివరాలు సేకరించి వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఎ.వి.రంగనాథ్ ఆదేశించారు. చట్టానికి వ్యతిరేకంగా పని చేసే ఉద్యోగులపై కొరడా ఝుళిపిస్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈవీడీఎం కమిషనర్‌గా ఎ.వి.రంగనాథ్ తాజాగా బాధ్యతలు చేపట్టారు. ఆ మరుసటి రోజు నుంచి జీహెచ్ఎంసీ పరిధిలో అక్రమ నిర్మాణాలపై ఆయన ఉక్కుపాదం మోపారు. మరోవైపు ఇదే లోటస్ పాండ్‌లోని వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైయస్ జగన్ నివాసంలో నిర్మించిన అక్రమ పార్కింగ్ స్థలాన్ని ఇటీవల జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేసిన విషయం విధితమే.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :115 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 29-06-2024 | పేజీలు:4 వెల: 2.00


## ఘనంగా పివి జయంతి వేడుకలు



హైదరాబాద్,జూన్28: దివంగత పివి నరసింహారావు జయంతి వేడుకలు తెలుగు రాష్ట్రాలతో పాటు, ఢిల్లీలోనూ ఘనంగా జరిగాయి. భారతరత్న, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి. ఆయన జయంతిని తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ఘనంగా జరుపుకున్నారు. హైదరాబాద్ పివి ఘాట్ వద్ద భారత రత్న, దివంగత మాజీ ప్రధాని పివి నరసింహారావు 103వ జయంతి వేడుకలు జరిగాయి. పివి ఘాట్ వద్ద పివి కుమార్తె వాణిదేవి, కుమారుడు ప్రభాకర్ రావు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, కోదండరామ్, హైకోర్టు జడ్జి శ్రావణ్ కుమార్, తదితరలు నివాళులర్పించారు. అసెంబ్లీలో పివి నరసింహారావు చిత్రపటానికి సభాపతి గడ్డం ప్రసాద్, మండలి చైర్మన్ సుఖేందర్ రెడ్డిలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఢిల్లీలో తెలంగాణ భవన్‌లో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబులు పివికి నివాళి అర్పించారు. ఆయన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. పివి ఆర్థిక దార్శనికుడని కీర్తించారు. తెలంగాణ భవన్‌లో పివి నరసింహారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఎంఎల్సీ వాణీదేవి, ఎంఎల్ఏ జగదీశ్ రెడ్డి, మహమూద్ అలీలు పూలమాల వేసి నివాళులర్పించారు. భారత రత్న దివంగత మాజీ ప్రధాని పి.వి 103 జయంతి సందర్భంగా గాంధీ భవన్ లో పి వి చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపి వి. హనుమంతరావు, డిసిసి అధ్యక్షులు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంగిశెట్టి జగదీష్, అల్లం భాస్కర్, భవాని రెడ్డి, రాపోలు జయ ప్రకాష్, ప్రేమలత అగర్వాల్, లింగం యాదవ్ తదితరులు నివాళు లర్పించారు.తెలంగాణ భవన్ లో మాజీ ప్రధాని, భారత రత్న పీవీ నరసింహ రావు జయంతి సందర్భంగా పీవీ చిత్రపటం వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, మహమూద్ అలీ, పీవీ కూతురు ఎమ్మెల్సీ వాణి దేవి , మాలోత్ కవిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. భారతదేశ చరిత్ర ఉన్నంత కాలం పీవీ చరిత్ర నిలిచి ఉంటుందని పేర్కొన్నారు. పీవీ నరసింహా రావు గొప్ప సంస్కరణల శీలి అని తెలిపారు. భూ సంస్కరణలో భాగంగా తన కుటుంబానికి చెందిన 800 ఎకరాలను మహనీయులు దారాదత్తం చేశారన్నారు. జైళ్ల శాఖ మంత్రిగా కూడా ఓపెన్ జైల్ విధానంతో సంస్కరణలు చేశారన్నారు. మైనార్టీ ప్రభుత్వాన్ని సైతం పూర్తికాలం సమర్థవంతంగా నడిపారన్నారు. పీవీ గొప్పతనాన్ని గుర్తించి భారత రత్న ప్రకటించిన కేంద్రానికి కేటీఆర్ అభినందనలు తెలిపారు. కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌లో పివికి మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళి అర్పించారు. ఆయన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. పివి దార్శనికత వల్లనే దేశం ఆర్థికంగా ఎదిగిందని అన్నారు.

## వాయిదాలతో మొదలైన పార్లమెంట్

న్యూఢిల్లీ,జూన్28: లోక్‌సభ సమావేశాలు వాయిదాలతో మొదలయ్యాయి. నీట్‌పేపర్ లీక్‌పై చర్చించాలన్న విపక్షాల డిమాండ్ కారణంగా గందరగోళం మధ్య లోక్‌సభ సోమవారానికి వాయిదా పడింది.సాధారణ సమావేశాలు శుక్రవారం ప్రారంభం కాగానే నీట్ పేపర్ లీకేజీపై చర్చకు విపక్షనేత రాహుల్ గాంధీ వాయిదా తీర్మానం ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్‌పై చర్చించాల్సి ఉందని, వారికి పార్లమెంట్ భరోసా ఇవ్వాల్సి ఉందని అన్నారు. అయితే నిబంధనల మేరకు రాష్ట్రపతి ప్రసంగంపై చర్చ ప్రారంభించాల్సి ఉన్నందున, అందులో ప్రస్తావించాలని స్పీకర్ ఓంబిర్లా సూచించారు. లేదా మరో తరహాలో చర్చకు అనుమతిస్తామని చెప్పారు. అయితే విపక్ష సభ్యులు అందుకు నిరాకరించారు. నీట్‌పై చర్చ చేయాల్సిందే నని పట్టుబట్టారు. నినాదలతో గందరగోళ పరిచే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో స్పీకర్ ఓంబిర్లా సభను మధ్యాహ్నం 12గంటలకు వాయిదా వేశారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో 'నీట్ పేపర్ లీక్ వ్యవహారం దుమారం రేపుతోంది. దీనిపై చర్చ జరపాలని విపక్షాలు డిమాండ్ చేయడంతో లోక్‌సభ, రాజ్యసభల్లో శుక్రవారం గందరగోళ వాతావరణం నెలకొంది. ప్రతిపక్షాల ఆందోళనలతో లోక్‌సభ సోమవారానికి వాయిదా పడింది. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే ఇటీవల మృతిచెందిన పలువురు రాజకీయ ప్రముఖులకు సభ సంతాపం ప్రకటించింది. అనంతరం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. దీనిపై స్పీకర్ చర్చను ప్రారంభించగా.. ప్రతిపక్షాలు నీట్ అంశాన్ని లేవనెత్తాయి. నీట్ పేపర్ లీక్ అంశంపై విద్యార్థుల కోసం సభలో చర్చించాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కోరారు. ఇందుకు సభాపతి ఓం బిర్లా అంగీకరించకపోవడంతో విపక్షాలు ఆందోళనకు దిగాయి. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. ఆ తర్వాత సభ తిరిగి ప్రారంభమైనప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. అయితే విపక్షాలు నిబంధనలు కాదని డిమాండ్ చేయడం సరికాదని పార్లమెంటరీ వ్యవహారా మంత్రి కిరణ్ రిజు అన్నారు. రాష్ట్రపతి ప్రసంగాన్ని ధన్యావా తీర్మానం అయిపోయాక చర్చకు అవకాశం ఉంటుందని చెప్పారు. అయితే దీనిని విపక్షాలు అంగీకరించలేదు. ప్రతిపక్షాల



నిరసన నేపథ్యంలో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. అటు రాజ్యసభలోనూ ఇదే గందరగోళం కన్పించింది. నీట్ అంశంపై చర్చకు పట్టుబడుతూ విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. వారి ఆందోళనల నడుమ కొంతసేపు ఛైర్మన్ సభను నడిపించారు. అయినప్పటికీ వారు తగ్గకపోవడంతో ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. వారి నిరసనల నడుమే రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో చర్చను చేపట్టారు. అంతకుముందు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీక్ సమస్య.. దేశ యువతకు సంబంధించిన కీలకమైన అంశం. దానిపై సభలో అర్థవంతమైన, గౌరవప్రదమైన చర్చను ప్రధాని మోదీ చేపట్టాలి. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం, ప్రతిపక్షం కలిసి పనిచేస్తోందనే సందేశాన్ని పార్లమెంట్ ఇవ్వాలని అన్నారు. 18వ లోక్‌సభ సమావేశాలు సోమవారం మొదలయ్యాయి. సోమ,మంగళ వారాలు సభలో కొత్త సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమాలతో ముగిసాయి. బుధవారం స్పీకర్ ఎన్నిక జరిగింది. గురువారం ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు.శుక్రవారం నుంచి సాధారణ సమావేశాలు మొదలయ్యాయి.

## ఢిల్లీని ముంచెత్తిన భారీ వర్షాలు..విమానాశ్రయంలో కూలిన టెర్మినల్ కప్పు

న్యూఢిల్లీ,జూన్28: ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఇందిరాగాంధీ విమానాశ్రయం లోని టెర్మినల్ 1లో కొంత పైకప్పు భాగం కూప్పకూలింది. ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. 8 మంది గాయపడ్డారు. వెంటనే సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదంలో పైకప్పు కింది పార్క్ చేసిన అనేక వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి. పైకప్పు కూలడంతో కారులోని వ్యక్తి మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదం కారణంగా పలు విమనాలు రద్దు చేశారు.. కాగా..ఈ ఘటనపై కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. ఢిల్లీ విమానాశ్రయంలో వ్యక్తిగతంగా తాను పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. క్షతగాత్రులకు చికిత్స కొనసాగుతోందని అని ట్వీట్ చేశారు. టెర్మినల్-1 దగ్గర సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం 2 వరకు టెర్మినల్-1 నుంచి డిపార్చర్‌కు బ్రేక్ ఇచ్చారు. పునరుద్ధరణ పనుల అనంతరం సర్వీసులను కొనసాగించనున్నారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఎయిర్ పోర్టుకు చేరుకుని.. టెర్మినల్ రూఫ్ పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులను వివరాలు అడిగితెలుసుకున్నారు.. దీంతో వేగంగా సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. అయితే.. కూలిన టెర్మినల్ 16 ఏళ్ల క్రితం నాటిదని పేర్కొంటున్నారు. ఢిల్లీలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్, ఫరీదాబాద్ సహా ఎన్‌సీఆర్‌లో ఏకధాటిగా వర్షం పడుతోంది. ఆర్కేపురం, సరితా విహార్, మునిర్కా, ఇండియా గేట్ ప్రాంతాలు తడిసి ముద్దయ్యాయి. భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఇళ్లలోకి వరదనీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గత రాత్రి నుంచి ఢిల్లీలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. కుండపోతగా కురుస్తున్న వర్షంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. భారీగా వరద నీరు రావడంతో లోతట్టు ప్రాంతాల్లో నీళ్లు నిలిచిపోయాయి. రోడ్లపైకి వర్షం నీళ్లు చేరడంతో కొన్ని చోట్ల ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనాలు నెమ్మదిగా కదులుతుండడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఐతే ఉదయం నుంచి వర్షం పడుతుండడంతో వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఈసందర్భంగా విమానయానశ్ఖాఖ మంత్రి రామ్మోమన్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ.. ఇది చాలా తీవ్రమైన ఘటన అని వ్యాఖ్యానించారు.ఇక్కడ మీకు ఒక విషయం స్పష్టత ఇవ్వాలనుకుంటున్నాను. ఈరోజు తెల్లవారుజామున కూలినది పాత భవనంలోని పైభాగం. దానిని 2009లో ప్రారంభించారు. ప్రధాని మోదీ ప్రారంభించిన భవనం అవతలివైపు ఉందని వెల్లడించారు. కూలిన భాగంలోని కొన్ని బీమ్‌లు తుప్పుపట్టి ఉన్నాయని ప్రశ్నించగా.. 'దీని గురించి ఇప్పుడే మాట్లాడటం తొందరపాటు చర్య అవుతుంది. దీనిపై తనిఖీ చేయమని



విమానాశ్రయ అధికారులను ఆదేశించాం. మంత్రిత్వ శాఖ, డీజీసీఏ విడివిడిగా దర్యాప్తు చేస్తుందని వెల్లడించారు. విమానాశ్రయంలో జరిగిన ఘటనపై కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఆ కూలిన టెర్మినల్‌ను ఇటీవలే ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారని హస్తం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నాయకురాలు ప్రియాంకాగాంధీ ఆరోపించారు. గత పదేళ్ల కాలంలో మోదీ ప్రభుత్వంలో చోటుచేసుకున్న అవినీతి, నేరపూరిత నిర్లక్ష్యం ఈ దుస్థితికి కారణం' అని దుయ్యబట్టారు. ఈ విమర్శలను ఉద్దేశించే కేంద్రమంత్రి బదులిచ్చారు. అదంతా తప్పుడు సమాచారం అని కొట్టిపారేశారు. కూలిపోయిన ఈ టర్మినల్ పైభాగాన్ని 2008-09 సంవత్సరంలో నిర్మించారని తెలిపారు. ఈ ఘటనపై కేంద్రమంత్రి తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ప్రభుత్వం తరఫున మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. గాయపడినవారికి ఒక్కొక్కరికి రూ.3 లక్షలు ఇస్తామని వెల్లడించారు. అలాగే సప్దర్‌జంగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల్ని ఆయన పరామర్శించారు. ఇక ఈ ఘటనతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. వారు ప్రయాణించాల్సిన విమానాల గురించిన సమాచారం అందక గందరగోళానికి గురయ్యారు. ఈ క్రమంలో డీజీసీఏ విమానయాన సంస్థలకు ఆదేశాలు ఇచ్చింది. ప్రత్యామ్నాయ విమానాలు ఏర్పాటుచేయాలని, విమానాలు రద్దయితే టికెట్ రీఫండ్ ఇవ్వాలని వెల్లడించింది. ఘటన జరిగిన వెంటనే అత్యవసర సహాయ బృందాలు చర్యలు చేపట్టాయని, పలువురు గాయపడ్డారని, వారికి వైద్య సాయం అందించినట్లు తెలిపారు. వెంటనే... టెర్మినల్ 1 నుంచి విమాన సర్వీసులు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ముందు జాగ్రత్త చర్యగా చెక్ ఇన్ కౌంటర్లు అన్ని మూసి వేశామని విమానాశ్రయ వర్గాలు తెలిపాయి. ఢిల్లీలో శుక్రవారం తెల్లవారు జాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఢిల్లీ, గురుగ్రామ్, నోయిడా, ఘజియాబాద్‌లో భారీ వర్షాలు పడుతున్నాయి. పలు ప్రాంతాల్లో కార్లు, బైకులు నీట మునిగాయి.

## కేసీఆర్ పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు



హైదరాబాద్ : హైకోర్టులో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. విద్యుత్ కమిషన్ ఏర్పాటు జీవోను కొట్టివేయాలని కేసీఆర్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. జస్టిస్ ఎల్‌నరసింహారెడ్డి జారీ చేసిన నోటీసులు రద్దు చేయాలని కేసీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. కేసీఆర్ పిటిషన్‌కు విచారణ అర్హత ఉందా లేదా అనే దానిపై వాదనలు ముగిశాయి. అనంతరం కేసీఆర్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ చేసినట్లు హైకోర్టు ప్రకటించింది. ఇవాళ సాయంత్రం లేదా సోమవారం తీర్పు వెల్లడించే అవకాశం ఉంది.అయితే కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణ స్వీకరణ చేయకుండా అడ్వకేట్ జనరల్ నిర్ణయించారు. పిటిషన్‌ను విచారణకు అనుమతించడంపైనే వాదనలు వినిపించాలని%ౌ% మెరిట్స్‌లోకి వెళ్లవద్దని ఏజీకి ధర్మాసనం సూచించింది. ఏజీ వాదనలపై కేసీఆర్ న్యాయవాది ఆదిత్యా సోంధీ అభ్యంతరం వ్యక్తం చేశారు. జ్యుడిషియల్ విచారణగా నోటిఫికేషన్‌లో తెలియజేసింది. నివేదిక ఇవ్వాలే గానీ, మీడియాకు వివరాలు వెల్లడించకూడదు. విద్యుత్ రంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని ముందే చెప్పి కారకులెవరో తేల్చమన్నారు. ఇది సరికాదు అని ఆదిత్యా సోంధీ గురించి.విద్యుత్తు కొనుగోళ్లు, థర్మల్ ప్లాంట్ల నిర్మాణంపై న్యాయమూర్తి ఎల్ నరసింహారెడ్డి విచారణ సంఘం ఏర్పాటును సవాల్ చేస్తూ కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌కు నంబర్ కేటాయించాలని గురువారం హైకోర్టు నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ప్రధాన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం హైకోర్టు రిజిస్ట్రీకి ఆదేశాలు జారీచేసింది. విద్యుత్తుపై రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 14న న్యాయమూర్తి ఎల్ నరసింహారెడ్డి విచారణ సంఘాన్ని నియమించింది. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్-తెలంగాణ మధ్య విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయని ప్రభుత్వం ఆరోపించింది. కమిషన్ ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విద్యుత్తుశాఖ ముఖ్య కార్యదర్శి, జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి విచారణ సంఘాన్ని, వ్యక్తిగత హోదాలో న్యాయమూర్తి ఎల్ నరసింహారెడ్డిని ఇందులో ప్రతివాదులుగా పేర్కొందారు.అయితే, న్యాయమూర్తి నరసింహారెడ్డిని ప్రతివాదిగా చేర్చడంపై హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరం వ్యక్తం చేశారు. నంబర్ ఇవ్వడానికి నిరాకరించారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ పిటిషన్ గురువారం హైకోర్టు ధర్మాసనం ముందు వచ్చింది. దాదాపు 45 నిమిషాలపాటు వాదప్రతివాదనలు జరిగాయి. కేసీఆర్ సుప్రీంకోర్టు న్యాయవాది ఆదిత్య సోంధి బలమైన వాదనలు వినిపించారు. ఆయనతో ఏకీభవించిన ధర్మాసనం.. హైకోర్టు రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలను తోసిపుచ్చింది. పిటిషన్‌కు నంబర్‌ను కేటాయించాలని సూచించింది. న్యాయమూర్తి నరసింహారెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ పిటిషనర్ అభియోగాలు మోపిన నేపథ్యంలో, పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపడతామని. ఈ మేరకు ఇవాళ విచారణ జరిగింది.

## ఎమర్జెన్సీ విధింపు అప్రజాస్వామికం కావొచ్చేమో కానీ, రాజ్యంగ విరుద్ధం కాదు



న్యూఢిల్లీ, ఇందిరాగాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీ అంశం లోక్‌సభ సమావేశాలను కుదిపేస్తోంది. పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన ప్రసంగంలో ఎమర్జెన్సీని ప్రస్తావించిన విషయం తెలిసిందే. ఇందిరాగాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీ.. దేశంలో అతిపెద్ద, చీకటి అధ్యాయం అని, రాజ్యాంగంపై ప్రత్యక్ష దాడి అని ముర్ము వ్యాఖ్యానించారు. దీంతో ఈ అంశం ప్రస్తుతం దుమారం రేపుతోంది. విపక్షాలు దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అత్యయిక స్థితిపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ తాజాగా స్పందించారు. ఎమర్జెన్సీ విధింపు అప్రజాస్వామికం కావొచ్చేమో కానీ, రాజ్యంగ విరుద్ధం మాత్రం కాదని అన్నారు. అయితే, ఎమర్జెన్సీ సమయంలో ప్రభుత్వ చర్యలను మాత్రం ఆయన తీవ్రంగా ఖండించారు.ఎమర్జెన్సీని తాను విమర్శిస్తానని..ఆ చర్యను సమర్థించడం లేదన్నారు.ఎమర్జెన్సీ సమయంలో ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చేయడం, మీడియాపై ఆంక్షలు విధించడం వంటి చర్యలు ప్రజాస్వామ్య వ్యతిరేకమని భావిస్తున్నట్లు చెప్పారు. ఎమర్జెన్సీ విధింపు అప్రజాస్వామికం కావొచ్చేమో కానీ..రాజ్యాంగ విరుద్ధం మాత్రం కాదన్నారు.ఒకప్పుడు రాజ్యాంగంలో అంతర్గత ఎమర్జెన్సీ విధింపునకు నిబంధన ఉండేదని గుర్తు చేశారు. కాబట్టి అప్పట్లో ఆ నిర్ణయం రాజ్యాంగ బద్ధమేనని అన్నారు.ప్రస్తుతం దాన్ని తొలగించారని పేర్కొన్నారు.కాబట్టి,చట్టపరంగా చూస్తే ద్రౌపది ప్రసంగంలో ఎమర్జెన్సీ రాజ్యాంగ విరుద్ధమనడం సరికాదని వ్యాఖ్యానించారు.

## మైనర్ బాలికను యడ్యూరప్ప వేధించారు..

బెంగుళూరు: బీజేపీ నేత బీఎస్ యడ్యూరప్ప(యెడియూరప్ప) మైనర్ బాలికను తన ఇంట్లో ఆసక్తిగా వేధించినట్లు సీఐడీ తన ఛార్జ్‌షీట్‌లో చేర్చారు. వేధింపులకు చెందిన 750 పేజీల ఛార్జ్‌షీట్‌ను సీఐడీ గురువారం విడుదల చేసింది. 17 ఏళ్ల అమ్మాయిపై లైంగిక వేధింపులకు పాల్పండిన కేసులో యడ్యూరప్పతో పాటు మరో ముగ్గురు నిందితులు కూడా ఉన్నారు. తన కూతురిపై యడ్డీ వేధింపులకు పాల్పడినట్లు ఆ అమ్మాయి తల్లి ఈ ఏడాది ఫిబ్రవరి 20వ తేదీన ఫేస్‌బుక్ అకౌంట్‌లో ఓ వీడియోను అప్‌లోడ్ చేసిన విషయం.2024, ఫిబ్రవరి 2వ తేదీన ఉదయం 11.15 నిమిషాలకు బాధిత మైనర్ తన తల్లితో కలిసి యడ్యూరప్ప ఇంటికి వెళ్లారు. బెంగుళూరులోని డాలర్స్ కాలనీలో ఉన్న ఆయన ఇంటికి వెళ్లారు. వారి దాడి కేసులో సాయం కోరేందుకు వాళ్లు మాజీ సీఎం ఇంటికి వెళ్లారు. తల్లితో మాట్లాడుతూనే యడ్యూరప్ప బాధితురాలు చేయిని పట్టుకున్నట్లు సీఐడీ తన ఛార్జ్‌షీట్‌లో చేరింది. ఆ తర్వాత మైనర్ అమ్మాయిని మరూమ్‌లోకి పిలిపించి గతంలో జరిగిన ప్రాసెసర్ వేధింపుల ఘటన గురించి అడిగినరోట్లు సూచిస్తున్నాయి. బాధితురాలి వయసు తెలుసుకున్న యడ్డీ.. ఆ తర్వాతగా ఉత్సాహంగా వేధించే ప్రయత్నం చేసినట్లు సీఐడీ రిపోర్టులో ప్రసిద్ధి చెందింది. మాజీ సీఎం చేయిని తోసేసిన బాధితురాలు.. రూమ్ నుంచి బయటకు పారిపోయింది. బాధితురాలు తల్లికి యడ్డీ డబ్బులు ఇచ్చినట్లు ఛార్జ్‌షీట్‌లో రాశారు.ఫిబ్రవరి 20వ తేదీన బాధితురాలి తల్లి వీడియోను అప్‌లోడ్ చేసిన



తర్వాత .. ఈ కేసులో నిందితులుగా ఉన్న అరుణ్, రుద్రేశ్, మారిస్వామిలు.. బాధితురాలిని, ఆమె తల్లిని కలిసే ప్రయత్నం చేశారు. యడ్యూరప్ప ఇంటికి బాధితురాలు, ఆమె తల్లిని తీసుకెళ్లిన వారు.. ఐఫోన్ గ్యాలరీ నుంచి ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేసిన వీడియోను డిలీట్ చేశారు. యడ్యూరప్ప కారణంగా ప్రకారం బాధితులకు రెండు లక్షలు చెల్లించారు.యడ్యూరప్పపై పోక్సోలోని సెక్షన్ 8 కింద కేసు బుక్ చేశారు. ఐపీసీలోని సెక్షన్ 354ఏ, 204, 214 కింద కూడా ఫిర్యాదు నమోదు చేశారు. మిగితా ముగ్గురు నిందితులపై ఐపీసీ 204, 214 సెక్షన్ల కింద కేసు పెట్టారు.

## సంపాదకీయం

శనివారం 29-06-2024

# నాడు ప్రకటిత ఎమర్జెన్సీ..నేడు అప్రకటిత ఎమర్జెన్సీ !

భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఎమర్జెన్సీ నిస్సందేహంగా ఒక చీకటి అధ్యాయం. అయితే ఆనాటి రాజకీయ పరిస్థితులు నాడు ఇందిరాగాంధీని అలా ప్రేరేపించి వుంటాయి. అయినా దేశమంతా వ్యతిరేకించారు కనుక తప్పే. దాదాపు 40 ఏళ్ల క్రితం నాటి విషయాన్ని ఎంచుకుని ఇప్పుడు రాజకీయం చేయాలని చూడడమే సరికాదు. అలా అయితే అనేక విషయాలను ముందేసుకుని తిడుతూ కూర్చోవాలి. బ్రిటిషర్లు రావడమే తప్పు. అంతకుముందు మొగలులు పాలించడం కూడా తప్పే. మనదేశ సంస్కృతి సంప్రదాయాలను దెబ్బతీయడం మరీ తప్పు. ఇవన్నీ కూడా మననం చేసుకుని మంచి చేయడం కోసం ముందుకు సాగాలి. గొంగట్లో కూర్చుని తింటూ..వెంట్రుకలు వస్తున్నాయని చెప్పడం సరికాదు. విపక్షంగా కాంగ్రెస్ బలంగా లోక్‌సభలో అడుగు పెట్టడంతో మోడీకి చెమటలు పడుతున్నాయా అన్న సందేహం కలుగుతుంది. గిల్లి కజ్జాలు పెట్టుకోవాలన్న మనస్తత్వంతోనే దీని గురించి పదేపదే ప్రస్తావిస్తూ..అసలు సమస్యలను పక్కదారి పట్టించే కుట్రలు చేస్తున్నారని భావించాలి. మోడీ, స్పీకర్ ఓం బిర్లా, చివరకు రాష్ట్రపతి ప్రసంగంలోనూ ఇప్పుడు ఎమర్జెన్సీ గురించి ప్రస్తావించడం అసవరమా అన్న అనుమానం వస్తోంది. జూన్ 25న ఇందిరా గాంధీ హయాంలో ఎమర్జెన్సీ ప్రకటన వెలువడిన రోజు... మొన్నటి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం రోజయిన జూన్ 24వ తేదీన..ప్రధాని మోడీ ఎమర్జెన్సీ గురించి ప్రస్తావించారు. లోక్‌సభలో స్పీకర్ ఓంబిర్లా 26వ తేదీన ప్రస్తావన చేశారు. ఇప్పుడీ అంశం అవసరమా అన్నదే ముఖ్యం. నిజానికి ఎమర్జెన్సీ లేకుండానే రైతులు ఢిల్లీ వీధుల్లో తిరగకుండా చేశారు. వారు ఆందోళన విరమించేలా చయడంలో మోడీ ప్రభుత్వం విఫలం అయ్యింది. కనీసం వారితో చర్చించడానికి కూడా మోడీ ముందుకు రాలేదు. అనధికారికంగా వందమందిక పైగానే మరణించారు. ఇంతకన్నా దారుణం ఉంటుందా....కరోనాతో వేలాదిమంది మరణిస్తే లెక్కలు దాచేయడం ఎక్కడి ప్రజాస్వామ్యం. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా విషయాలు ఉన్నాయి. దాదాపు అర్ధ శతాబ్దం క్రితం, 1975 జూన్ 25న భారత రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ అధికారికంగా ఎమర్జెన్సీని ప్రకటించారు. అందుకు కారణం అలహాబాద్ హైకోర్టు తీర్పు. దీని ప్రకారం 1971లో ఇందిరా గాంధీ ఎన్నిక చెల్లదు. అధికార భీతితో ప్రభుత్వం హడావుడిగా రాజ్యాంగంలోని 352వ అధికరణను వర్తింపజేసి అత్యవసర పరిస్థితిని విధించింది. ఇది 1977 మార్చి 21 వరకు కొనసాగింది. భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఇది చీకటి కాలం.త్యవసర పరిస్థితి ప్రకటించిన వెంటనే పత్రికా స్వేచ్ఛను హరించేలా ప్రభుత్వం ఒక చట్టం చేసింది. ప్రభుత్వ నియంత్రణలో ఉన్న వార్తాపత్రికలు, ఆకాశవాణి, దూరదర్శన్ మాత్రం ప్రభుత్వ వైభవాన్ని ప్రసారం చేస్తూనే ఉన్నాయి. వార్తాపత్రికలు, మ్యాగజైన్ల నుండి తమకు అభ్యంతరకరమైన విషయాలను తొలగించేం దుకు బ్యూరో ఆఫ్ ప్రెస్ సెన్సార్‌షిప్ పని చేసింది. అయినప్పటికీ, కొన్ని వార్తాపత్రికలు, అనేక మంది జర్నలిస్టులు ప్రధానంగా నిజాన్ని పేర్కొనేందుకు ప్రయత్నించారు. ఫలితంగా ఎందరో ఎడిటర్లు, జర్నలిస్టులు అరెస్ట్ కావాల్సి వచ్చింది. పార్లమెంటరీ వ్యవస్థను నిర్లక్ష్యం చేశారు. ప్రతిపక్ష రాజకీయ పార్టీలపై దాడులు, దేశవ్యాప్తంగా మూకుమ్మడి అరెస్టులు జరిగాయి. సమావేశాలు, ప్రదర్శనలు, ఊరేగింపులు, సమావేశాలు నిషేధించబడ్డాయి. జ్యోతిబసు, జయప్రకాష్ నారాయణ్, మొరార్జీ దేశాయో, అద్వానీ, జార్జి ఫెర్నాండెజ్ సహా దేశంలోని ప్రముఖ రాజకీయ నాయకులు జైళ్ల పాలయ్యారు. మీసా తదితర చట్టాల కింద వేలాది మంది రాజకీయ కార్యకర్తలు, నాయకులను అరెస్టు చేశారు. అంతేగాక, సామాన్య ప్రజల ప్రాథమిక హక్కులు కూడా ప్రమాదంలో పడ్డాయి. భావ ప్రకటనా స్వేచ్ఛ, నిరసన తెలిపే హక్కు, పౌరహక్కులు హరించబడ్డాయి. సాంస్కృతిక ప్రపంచంలో ఆంక్షలు, అరెస్టులు కూడా జరిగాయి. నాటక ప్రదర్శనల నిషేధం, సినిమా ప్రదర్శనల నిలిపివేత జరిగాయి. కానీ ఎమర్జెన్సీ లేకుండానే ఇప్పుడు ఆనాడు ఇందిర అమలు చేసిన అన్ని విధానాలు అమలవుతున్నాయి. ఇడి, ఐటి,ఐబిలను ఉపయోగించి విపక్ష నేతలను, సిఎంలను అరెస్ట్ చేసి జైళ్లలో వేసేస్తున్నారు. ధర్నాలు లేవు. పార్లమెంటులో మాట్లాడే హక్కులు లేకుండా చేశారు. మూకుమ్మడిగా సభ్యులను సభనుంచి పంపించేశారు. నరేంద్ర మోడీ హయాంలో అన్నిటినీ పీఎంఓ కార్యాలయం కేంద్రంగా మారింది. మోడీ ఎప్పుడూ ప్రజాస్వామ్య బాటలో నడవలేదు. విలేకరుల సమావేశంలో జర్నలిస్టులు అడిగిన ప్రశ్నలకు ఎన్నడూ సమాధానం ఇవ్వరు. మీడియా సమావేశాలకు దూరంగా ఉంటారు. పార్లమెంటులో విపక్షాల చర్చను ఆయన వినరు. ఎవరి మాట వినకుండా, పార్లమెంట్‌లో చర్చ లేకుండానే డీమోనిటైజేషన్ చేశారు. కోవిడ్ కాలంలో అహేతుక, అశాస్త్రీయ చర్యలను చేపట్టారు. పి.ఎం కేర్స్ ఫండ్‌ను ప్రైవేట్ ఫండ్‌గా మార్చారు. ఎటువంటి చర్చ లేకుండా ఎలక్టోరల్ బాండ్లని ప్రవేశపెట్టారు. క్రమంగా రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలు తగ్గుతున్నాయి. వారికి విలువ లేకుండా చేస్తున్నారు. పార్లమెంటులో చర్చకు అవకాశం రావడం లేదు. పార్లమెంటరీ వ్యవస్థలో చట్టాలు చేసే హక్కును తీసివేసి ఆర్డినెన్స్ రాజ్‌ని స్థాపించారు. వ్యవసాయ చట్టం, విద్యుత్ చట్టం ఆర్డినెన్స్‌లు చేసి అమలుకు దిగింది. పార్లమెంటులో మెజారిటీ వుండడంతో బిల్లులను దాదాపు బలవంతంగా ఆమోదించడం ఆనవాయితీగా మారింది. భారత రాజ్యాంగం ముఖ్య లక్షణాలలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమాఖ్య నిర్మాణం ప్రధానమైనవి. కానీ మోడీ ప్రభుత్వం రాజ్యాంగ సారాంశం పైనే క్రమపద్ధతిలో దాడికి దిగింది. ప్రతిపక్ష పార్టీలను విచ్ఛిన్నం చేయడానికి, ప్రభుత్వాలను స్వాధీనం చేసుకోవడానికి, ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ఆర్థిక ప్రయోజనం పొందడానికి ఇ.డి, సిబిఐ వంటి కేంద్ర సంస్థలను వినియోగించుతున్నది. కార్పొరేట్లకు అనుకూలంగా ప్రభుత్వం నల్ల వ్యవసాయ చట్టాలను ఆమోదించబోయి భంగపడింది. దేశానికి అన్నం పెట్టే రైతాంగం పైనే యుద్ధానికి దిగి వారిని క్రూర హింసలకు గురి చేసింది. స్వతంత్ర జర్నలిస్టులు, పోర్టళ్లు, సోషల్ మీడియాను నియంత్రించేందుకు ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేసింది. ఇవన్నీ ఎమర్జెన్సీలో ఇందిర చేయగా, ఇప్పుడు ఎమర్జెన్సీ అన్న పదం మాత్రం లేకుండా మోడీ అన్నీ చేస్తున్నారు. పార్టీలో చర్చలు లేవు. ప్రభుత్వంలో చర్చలు లేవు. విపక్షాలను పిలిచి చర్చించే సంప్రదాయం లేకుండా చేశారు. ప్రజల్లో చర్చ ఉన్నా విలువ లేదు. ఇలాంటి తీరును అవలంబిస్తున్న ప్రధాని మోడీ తన విధానాలు మర్చుకుంటే మంచిది. అది తగదన్నట్లు దానికి పరాకాష్టగా ఇప్పుడు ఎమర్జెన్సీ చీకటి రోజులు అంటూ మాట్లాడుతున్నారు. ఇలాంటి గిల్లి కజ్జాల కన్నా దేశం బాగుపడే విధంగా నిర్ణయాలు తీసుకుంటే మంచిది. ప్రజలు కూడా హర్షిస్తారు.

# బీటలు వారుతున్న ఐటి కోట

హైదరాబాద్,నిన్నమొన్నటి వరకూ ఉద్యోగాలకు కేరాఫ్ అడ్రస్ సాఫ్ట్‌వేర్ రంగం. గత మూడు దశాబ్దాలుగా నిరుద్యోగులకు కల్పవృక్షంలా మారి, లక్షలాది మందికి ఈ రంగం ఉపాధి చూపించిందనడంలో సందేహం లేదు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగమంటే లక్షల్లో జీతం. లగ్జరీ జీవితం. అంబాజీపేట నుంచి అమెరికా వరకూ యువతకు బాటలు వేసింది ఈ సాఫ్ట్‌వేర్ రంగమే అంటే అతిశయోక్తి కాదు. ఒకప్పుడు డిగ్రీ అంటే బిఏ, బికాం, బిఎస్‌సి అనేవారు. కానీ ఆ తర్వాత డిగ్రీకి బిటెక్ పర్యాయపదంలా మారిపోయింది. అమెరికాలో ఉద్యోగాలు అందిపుచ్చుకుని, అక్కడే గ్రీన్ కార్డు సంపాదించి స్థిరనివాసం ఏర్పరచుకున్నవారి సంఖ్య యాభై లక్షల పైచిలుకు. అగ్రరాజ్యంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్న ఇతర దేశస్థులలో భారతీయుల సంఖ్యే అధికం.అయితే తదనంతర పరిణామాల్లో అనేక ఇతర దేశాల మాదిరిగానే అగ్రరాజ్యం కూడా ఒడిదుడుకులకు లోనైంది. దాని ఫలితం సాఫ్ట్‌వేర్ రంగంపైనా పడింది. 2020లో మొదలై, దాదాపు రెండేళ్లపాటు కొనసాగిన కారణంగా లాక్డౌన్ విధించడంతో అనేక ఐటి కంపెనీలు మూతపడ్డాయి. ఈ పరిశ్రమలకు చేయూతనిచ్చేందుకు అక్కడి ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించింది. ఆర్డర్లు అందాయి. కానీ, ఇదే సమయంలో ప్రభుత్వం ప్యాకేజీలను ఉపసంహరించుకోవడంతో ఐటీ పరిశ్రమల పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ప్రభుత్వ ప్రోత్సాహకాలు తగ్గడం, బ్యాంకులు భారీగా వడ్డీ రేట్లను పెంచడం, ఇంతకు ముందు మాదిరిగానే ఆర్డర్లు విడుదలైంది ఐటి పరిశ్రమల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలాగ. చేయాల్సిన పని కంటే పని కోసం కంపెనీలో ఉన్న ఉద్యోగుల సంఖ్య ఎక్కువకావడంతో యాజమాన్యాలు ఉద్యోగాల్లో కోత విధించడం మొదలుపెట్టాయి. దీని ప్రభావం భారతీయులపైనే ఎక్కువగా పడిందని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అమెరికాలో అమెరికాలో సంపాదించుకోవచ్చనే ఆశతో మన దేశస్థులు ఏటా భారీ సంఖ్యలో ఆ దేశానికి పయనమవుతూ ఉంటారు. ఎంఎస్ వంటి కోర్సులు చేసి, అక్కడే ఉద్యోగాలు సంపాదించుకుని, స్థిరపడుతున్నవారి సంఖ్య లక్షల్లో ఉంటుంది.ఒక్క 2022- 23 సంవత్సరంలోనే ఇలా రెండు లక్షల మంది అమెరికాకు వెళ్లినట్లు అంచనా. వీరిలో తెలుగు విద్యార్థుల సంఖ్య యాభైవేలకు పైగానే ఉంటుంది. ఇలా వెళ్లినవారిలో నూటికి 85 మందికి అక్కడే ఉద్యోగాలు కూడా లభించేవి. కానీ ఇప్పుడు పరిస్థితి లేకపోవడంతో అమెరికాలో భారతీయ నిరుద్యోగుల సంఖ్య రానురాను పెరిగిపోతోంది. అమెరికాలో ఉండలేక, స్వదేశానికి తిరిగి రాలేక నిరుద్యోగులు సతమతమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. పొట్ట పోషించుకునేందుకు రెస్టారెంట్లు, గ్యాస్ స్టేషన్లలో పని చేస్తూ కాలక్షేపం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మన దేశంలోనూ పరిస్థితులు దీనికి విరుద్ధంగా లేవు. ఐటి



రంగంలో ఈ ఏడాది జనవరినాటికి 50 వేల ఉద్యోగ ఖాళీలు భర్తీ అయినట్లు అంచనా. అయితే రెండేళ్ల క్రితం నియామకాలతో తాజాగా 60 శాతం తగ్గినట్లు ప్రముఖ ఉద్యోగ కల్పన సంస్థ లింక్ డిన్ సర్వేలో ఉంది. చిన్నా చితకా ఉద్యోగుల కంటే భారీ వేతనాలు అందుకుంటున్న ఉద్యోగులపైనే ఎక్కువగా వేటు పడుతోంది. ఆర్థికభారం తగ్గించుకోవాలన్న యాజమాన్యాల ఆలోచనే దీనికి కారణం.కేవలం ఐటి సంస్థలే కాదు, హెచ్‌ఎస్‌బిసి, మోర్గాన్ స్టాన్లీ, నైకే, టెస్లా వంటి ఐటీయేతర బడా కంపెనీల్లోనూ ఉద్యోగాల కోత భారీగానే ఉండటం ఆందోళనకరం. ఈ పరిణామానికి కృత్రిమ మేధను కూడా ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. నిన్నమొన్న కళ్లు తెరిచిన ఈ సాంకేతిక పరిజ్ఞానం ఒక్కొక్క రంగాన్ని కబళిస్తూ లక్షల సంఖ్యలో ఉద్యోగాలను కొల్లగొడుతోంది.ఉద్యోగులకు వేతనాల రూపేణా లక్షలాది డాలర్లు వెచ్చించే బదులు కృత్రిమ మేధను అందిస్తే పని సులువవుతుందనే ధోరణి ఐటి కంపెనీల యాజమాన్యాలలో ప్రబలింది. నవంబర్‌లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కొత్తగా వచ్చే ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి చేయూతనిస్తే ఐటితో పాటు ఇతర రంగాలు కూడా కోలుకునే అవకాశాలు ఉన్నాయని కంపెనీల యాజమాన్యాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. పన్నుల రూపం లో ఆర్థిక వ్యవస్థకు ఆలంబనగా నిలిచే లక్షలాది ఉద్యోగులు ఏ దేశానికైనా కీలకమే. భారత దేశంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఏ ప్రభుత్వం రూపొందించిన నూతన పారిశ్రామిక విధానంపైనే నిరుద్యోగులు గంపెడాశలు పెట్టుకున్నారు. వారి ఆశలు నెరవేరే దిశగా నూతన విధానాల రూపకల్పనతో పారిశ్రామిక సంస్థలకు ఊతమిచ్చి, ఉపాధి అవకాశాలను అందించడం ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం.

# ఆకలి కేకలను ఆపగలమా..!



న్యూఢిల్లీ,ప్రపంచంలో పోషకాహార లోపం వున్న వారు అత్యధికంగా ఆసియా దేశాల్లో 41.8 కోట్ల మంది ఉండగా, ఆఫ్రికాలో 28.2 కోట్ల మంది ఉన్నారు. గొంతు మహమ్మారి విజృంభణతో పాటు 3 కోట్ల మంది పేదలు ఆకలితో అలమటించారు. ప్రత్యేక చర్యలు అమలుపరచని పక్షంలో 2030 నాటికి 66 కోట్ల మంది పేదలు ఉంటారని, ఆకలిని అంతం చేయడం అసాధ్యమని తెలుస్తున్నది.ఐక్యరాజ్యసమితి ప్రధాన శాఖలైన ప్రపంచ ఆహార సంస్థ (యఫ్ఏఓ), యునిసెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ), ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ అగ్రికల్చరల్ డెవలప్‌మెంట్ (ఐయఫ్ఏడీ), వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ (డబ్ల్యూయఫ్‌పి)లు సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనాల ఆధారంగా నివేదిక విడుదల చేయబడింది. ఈ నివేదిక వెలువరించినవే. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో (యస్‌డిజి) భాగంగా 2030 నాటికి ప్రపంచంలో ఆకలి చావులు, పోషకాహార లోపం లేకుండా చూస్తూ, 'జీరో హంగర్ (ఆకలి లేని లోకం)' సాధించాలనే ఉన్నత నిర్ణయం తీసుకున్నారు.

పోషకాహార అభద్రత

ప్రపంచవ్యాప్తంగా 237 కోట్లకు పైగా (ప్రతి ముగ్గురిలో ఒకరు) ప్రజలకు అవసరమైన ఆహారం లభించడం లేదని నివేదిక తెలుపుతోంది. లింగ వివక్ష కారణంగా పురుషుల కన్న మహిళల్లో 10 శాతం అధికంగా ఆహార అభద్రతతో బాధపడుతున్నారు. ఆహార ధాన్యాల అధిక ధరలు, ఆదాయం తగ్గడం వల్ల 300 కోట్ల మంది పేదలు పోషకాహారానికి దూరం అవుతున్నారు. పోషకాహార లోపం ప్రపంచ మానవాళికి శాపంగా వెంటాడుతున్నది. ప్రపంచవ్యాప్తంగా 22 శాతం (150 కోట్లు) ఐదేళ్ల లోపు పిల్లలు శరీర వృద్ధి నిలిచిపోవడం (స్టంటింగ్)తో, 6.7 శాతం (4.54 కోట్లు) అభివృద్ధి తగ్గడం (వెస్టింగ్)తో, 5.7 శాతం (3.89 కోట్లు) అధిక బరువు (ఓవర్ వేయిట్) సమస్యలతో బాధ పడుతున్నారు. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో పిల్లల పోషకాహారలోపం అత్యధికంగా కనిపిస్తున్నది. ఆసియా, ఆఫ్రికా దేశాలలో 15-49 ఏళ్ల మహిళల్లో 30 శాతం రక్తహీనత (ఎనీమియా) సమస్య కనిపించింది, అమెరికా, యురోప్‌లో 14.6 శాతం మాత్రమే నమోదైంది. గర్భిణిలలో రక్తహీనత, పిల్లల్లో ఎదుగుదల మందగించడం, తల్లి పాల లభ్యత పడిపోవడం, తక్కువ బరువుతో శిశు జననాలు, అధిక బరువు పెరగడం, వయోజనుల్లో స్థూలకాయం లాంటి సమస్యల మధ్య 2030 నాటికి ఆకలి అంతం చేయడం అసాధ్యమని వివరించారు.

వాతావరణ ప్రభావం

ఆహార అభద్రత, పోషకాహార లోపం పెరగడానికి కారణాలు వాతావరణంలో అసాధారణ మార్పులు, ఆర్థిక మందగమనం, ఆర్థిక అసమానతలు, లాక్‌డౌన్/కర్ఫ్యూలు వంటి మార్పుల నివేదిక సూచన. ఆహార ధాన్యాల దిగుబడి, ఆదాయాలు తగ్గడం, మార్కెటింగ్ లొసుగుల (ఉత్పత్తి, పంట కోత, ప్రాసెసింగ్, రవాణా, మార్కెటింగ్, ధరలు)తో పేదలు పోషకాహారానికి దూరం అవుతున్నారు. పోషకాహార లభ్యత పెరగడానికి... వాతావరణం ఒడుదుడుకులను తట్టుకోగల ఆహారాలు, ఆర్థిక కష్టాలను అధిగమించడం, ఆహార సరఫరాలను పరిరక్షించడం, పేదరికంతో పాటు అసమానతలను తొలగించడం, పోషకాహారం పట్ల ఆరోగ్య అవగాహన కల్పించడం లాంటి అంశాలు. ఆర్థిక అసమానతలు పెరిగిన ప్రకృతి సహజమైన సారవంతమైన నేలలు, మత్స్య సంపద, సంపద, నీటి వనరుల కోసం ఘర్షణలు జరగడం సర్వసాధారణం. సమాజంలో, ఆదాయం సామర్థ్యం, ??ఆస్తులు, టెక్నాలజీ, విద్య, ఆరోగ్య రంగాల్లో అసమానతలు పెరిగితే వాటి దుష్ప్రభావం అధికంగా మహిళలు, పిల్లలపై నేరుగా పడుతుంది.ఆహార ధాన్యాల ఉత్పత్తి నుండి వినియోగం వరకు ఇమిడి ఉన్న పలు దశల్లో ఆహారం వ్యర్థం కావడం నేర సమానమని నమ్మాలి. ఆహారాన్ని ఆదా చేస్తే ఆహారం ఉత్పత్తి చేసిన దాని కన్నా మిన్న అని తెలుసుకోవాలి. 'యు.యన్' ఫుడ్ సిస్టమ్స్ సమిట్' సూచనల ప్రకారం ప్రపంచ దేశాలు తమదైన చర్యలను తీసుకుంటూ 2030 నాటికి 'జీరో హంగర్' సుస్థిరాభివృద్ధి లక్ష్యాలైన ఆహార అభద్రత (యస్‌డిజి టార్గెట్-2.1), పోషకాహార లోపాలను (యస్‌డిజి టార్గెట్-2.2) అధిగమించి, అనుకున్న సదుపాయాన్ని చేరుకోవాలి.

### ఫిరాయింపుల చట్టం అపహాస్యం

హైదరాబాద్, పార్టీ ఫిరాయింపుల చట్టం తెచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇవాళ సిగ్గు లేకుండా ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందని,సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేల ఇంటింటికి వెళ్లి కండువాలు కప్పుతున్నాడని సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై తెలంగాణ భవన్‌లో జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. పార్టీ ఫిరాయింపుల చట్టం తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ. పార్టీ ఫిరాయింపులు మంచిది కాదు.. దీన్ని మనం పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం. చట్టాన్ని మరింత బలోపేతం చేస్తాం. ఫిరాయింపు జరిగిన

# రైతుబంధు ఎప్పుడిస్తారో చెప్పండి

సిద్దిపేట,రైతు బందు డబ్బులు ఎప్పుడు వేస్తారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ప్రశ్నించారు. రైతుభరోసా విధివిధానాలు ఏమిటని అడిగారు. రైతుబంధు పంట అయ్యాక ఇస్తారా?.. పంట ముందు ఇస్తారా? అంటూ హరీష్ రావు ప్రశ్నల వర్షం కురిపించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రెడ్డి సంక్షేమ సంఘంలో జడ్పీ చైర్మన్ రోజా శర్మ అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ మను చౌదరి ఎమ్మెల్యేలు హరీష్ రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సిద్దిపేట జిల్లాను పదవ తరగతి ఫలితాల్లో రెండవ స్థానంలో నిలిపినందుకు ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. నాలుగు నెలల మధ్యాహ్నం భోజన కార్మికులకు జీతాలు వెంటనే విడుదల చేయాలి. విద్యార్థులకు ఒక్క జత బట్టలు మాత్రమే ఇచ్చారు. రెండవ జత బట్టలు అన్ని జిల్లాలకు ఇచ్చినట్లు సిద్దిపేట జిల్లకు వెంటనే ఇవ్వాలి. మన ఊరు మన బడి మిగిలిన పనులను వెంటనే పూర్తి చేసి ఇవ్వాల్సిన బిల్లులు ఇవ్వాలి. ఉపాధి హామీ పథకంలో సీసీ రోడ్ పోసిన కాంట్రాక్టర్లకు 7నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏప్రిల్, మే, జూన్ మూడు నెలల ఆసరా పెన్షన్‌లు రాలేదు. సకాలంలో పెన్షన్ రాక వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. కాళేశ్వరం కాలువలలో మట్టి పడి నీటి విడుదలలో ఇబ్బంది ఉంది కనుక వాటిని శుద్ధి చేయాలి. ఆరు నెలల్లో గ్రామపంచాయితీలకు రూపాయి రాలేదు. మహిళ ప్రాంగణం, వృద్దాశ్రమం, వర్కింగ్ ఉమెన్ హాస్టల్ వాడుకలోకి తీసుకురావాలి. సఖి సెంటర్ సిబ్బందికి 7నెలలుగా వేతనాలు రాలేదు' అని హరీష్ రావు పేర్కొన్నారు.

# మొక్కల పెంపకం సామాజిక బాధ్యత

నిజామాబాద్,హరితహారం కావచ్చు, మొక్కలు నాటడం కావచ్చు. పచ్చదన్నం కావచ్చు..కార్యక్రమం ఏదైనా మొక్కలు పెంచడం, కాపాడుకోవడం ప్రజల విధి కావాలి. ఇందుకు ప్రభుత్వం కూడా గట్టిగా కృషి చేయాలి. ఇది ప్రతి ఒక్కరి కార్యక్రమమని, దీనిని సమిష్టిగా చేపట్టినప్పుడే ఫలితాలు రాబట్టవచ్చని గుర్తించాలి. తాము చేపట్టిన హరితహారం కార్యక్రమం వల్ల గ్రీన్ కవర్ 7.7 శాతం పెరిగిందని గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించుకుంది. ఇది నిరంతరంగా సాగితే త్వరలోనే తెలంగాణ ఆకుపచ్చని తెలంగాణ కాగలదని అన్నారు. అయితే ప్రభుత్వంలో ఎవరు ఉన్నా లేకున్నా..మొక్కలు పెంచడం నిరంతర ప్రకరియ కావాల్సి ఉంది. దీనిని మరింత చైతన్యవంతంగా తీసుకుని వెళితే కోతులు వాపస్ పోవడం.. వానలు వాపస్ రావడం ఖాయం కాగలదు. జూన్ మాసాంతం వచ్చినా నేటికీ వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడానికి వర్షాభావ వాతావరణమే కాకరణం. మొక్కలు నాటడం, పెంచడం అన్నది నిరంతర పక్రియ అని ప్రజలంతా గుర్తుంచుకోవాల్సి ఉంది. వంద శాతం పచ్చదనం ఉండేలా మొక్కలు నాటాల్సిన అవసరం ఉంది. ప్రతి ఒక్కరూ దీనిని సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రభుత్వంతో కలసి రావాల్సి ఉంది. ప్రతి జిల్లాను హరిత జిల్లాగా మార్చాలనీ, ఇందుకు అధికారులంతా సమష్టిగా కృషి చేయాల్సి ఉంది. రోడ్లకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలి. ఏ రకం మొక్కలు ఏయే ప్రదేశాల్లో నాటాలో అటవీ శాఖ అధికారులు సూచనలివ్వాలి. సరైన సమయంలోనే మొక్కలు నాటడం చేపట్టాలి. వెన్యూ ప్లాంటేషన్‌కు పండ్ల మొక్కలను సంబంధిత గ్రామప్రజలతో మాట్లాడి వారి సహాయ సహకారాలతో నాటితే కోతుల బాధ కొంతయినా పోతుంది. ప్రభుత్వ నర్సరీల్లో మొక్కలు సరైన దశలో వృద్ధి చెందిన మీదటే నాటేందుకు చర్యలు చేపట్టాలి. అన్ని పాఠశాలల్లో పచ్చదనం ఉండేలా మొక్కలు నాటేలా విద్యార్థులను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలి. పట్టణాల్లో జంక్షన్లు, రోడ్ల సుందరీకరణకు మొక్కలు నాటాలి. అవసరాలకు ఏయే రకం మొక్కలు ఎన్ని కావాలో సర్వే చేసి తదనుగుణంగా నర్సరీల్లో మొక్కల పెంపకం చేపడితే ప్రయోజనం చేకూరుతుంది. ఈ సంవత్సరం లక్ష్యాన్ని చేరుకునే విధంగా మొక్కలను నాటాల్సి ఉంది. అధికారులు దృఢనిర్చయంతో ముందుకు సాగాలి. గతేడాది వరుణ దేవుడు కరుణించడంతో నాటిన మొక్కలు జీవం పోసుకుంటున్నాయి. ఇందులో భాగంగానే ఫారెస్ట్ నర్సరీలో లక్షల్లో వివిధ రకాల మొక్కల పెంపకం, అలాగే ఈజీఎస్ కింద వివిధ రకాల మొక్కలను పెంచిపోషిస్తున్నారు.ఈ ఏడాది మంచి వర్షాలుకురుస్తున్న కారణంగా కార్యక్రమాన్ని ఒక మహోత్తర ఉద్యమంగా ముందుకు తీసుకెళ్ళాల్సి ఉంది. మొక్కలు నాటించి ఈజీఎస్ కూలీల ద్వారా నాటిన మొక్కల చుట్టూ రక్షణ కంచెలు సైతం ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేయాలి. కోట్లాది రూపాయల ఖర్చుతో వివిధ శాఖల ఆధ్వర్యంలో పండ్లు, పూలు, అటవీ, మిశ్రమ జాతి మొక్కలతో ఇతర మొక్కల పెంపకాన్ని చేపట్టారు. వన విభాగం కింద ఒకటి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో నర్సరీలను నెలకొల్పి మొక్కల పెంపకం చేపట్టడం అవసరం.

# అయిదేళ్ళూ ప్రధానే !

అమరావతి,దేశంలో ఎక్కడా లేని రాజకీయం ఏపీలో ఉంది. ఇక్కడ రాజకీయ పార్టీలు ప్రత్యర్థులుగా భావించడంలేదు. శతృవులుగా ఒకరిని ఒకరు చూసుకుంటున్నాయి. దాంతో అవతల పక్షాన్ని అణచాలని ఎత్తులు పై ఎత్తులు వేస్తున్నాయి. ఇది కాస్తా కేంద్రంలోని బీజేపీకి బాగా ఉపయోగపడుతోంది.కెంద్రం సాయంలో ఏపీలో ప్రత్యర్థిని పూర్తిగా దెబ్బ తీయాలని అధికారంలో ఉన్న పార్టీ భావిస్తే ఆ పరిస్థితి లేకుండా చేసుకోవడానికి ప్రత్యర్థి పక్షం కూడా కేంద్రంలో బీజేపీకి జై కొడుతోంది. 2014 నుంచి ఇదే కథ సాగుతోంది. ఉమ్మడి ఏపీలో ఈ విధంగా లేదు. ప్రతిపక్షాలు అంటే వారి రాజకీయ విధానం వేరుగా ఉండేది.కానీ గత పదేళ్ళుగా చూస్తే టీడీపీ వైసీపీ ఢిల్లీలో దోస్తీ ఏపీలో కుస్తీ అన్నట్లుగా సాగుతున్నాయి. దీని వల్ల ఏపీకి మేలు జరగకపోగా బీజేపీ ఈ రెండు పార్టీలను తన రాజకీయ అవసరాలకు ఎంచక్కా వాడుకుంటోంది. కేంద్రంలో బీజేపీకి లోక్ సభలో తెలుగుదేశంతో అవసరం ఉంది. ఆ పార్టీకి 16 మంది ఎంపీలు ఉన్నారుదాంతో ఎన్డీయేలోకి చేర్చుకుంది. మూడు పార్టీలు కలసి పోటీ చేసి తాజా ఎన్నికల్లో గెలిచాయి. అలా కేంద్ర మంత్రివర్గంలో టీడీపీ చేరింది. ఏపీ మంత్రివర్గంలో బీజేపీ చేరింది. ఇది ఒక రాజకీయ విధానం. దీనిని తప్పు పట్టాల్సింది లేదు. మరి ఏపీలో టీడీపీ బీజేపీతో పోటీ పడి చిత్తుగా ఓటమి పాలు అయిన వైసీపీ రాజకీయ విధానం ఎలా ఉండాలి. ఈ పార్టీలకు పూర్తి భిన్నంగా ఉండాలి.బీజేపీ ఉన్న ఎన్డీయే ప్రభుత్వానికి వారు దూరంగా ఉండాలి. కానీ స్పీకర్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి మద్దతు ఇవ్వడం ద్వారా ఎన్డీయేకు బయట నుంచి మిత్రుడిగా వైసీపీ మారిపోయింది. దానికి కారణం వైసీపీ సొంత అవసరాలు తప్ప ఏపీ ప్రయోజనాలు ఏమీ కావు అని అంటున్నారు. ఒక వేళ ఏపీ ప్రయోజనాలు ఉండి ఉంటే ప్రత్యేక హోదా మీద కండిషన్ పెట్టాలి. స్టీల్ ప్లాంట్ విషయంలో ప్రైవేటీకరణను ఆపు చేయించాలి. విభజన హామీలను తీర్చాలని కోరాలి.అసలు ఈ ఆయాసం అంతా ఎందుకు కూటమి కట్టిన పార్టీలు అవన్నీ చూసుకుంటాయి. తనకు ప్రత్యర్థిగా ఎదురు నిలిచి తనను ఓడించిన పార్టీకి మద్దతు ఇవ్వడం దేశ రాజకీయాల్లో ఎక్కడైనా చూశారా అని అంతా అంటున్నారు. అది ఏపీ విషయంలోనే జరిగింది అని అంటున్నారు. అది కొత్త ఏమీ కాదు, 2014 నుంచి 2019 దాకా కూడా ఇలాగే వైసీపీ మద్దతు ఇచ్చింది. ఆనాడూ బీజేపీ టీడీపీ కలసి వైసీపీని ఓడించాయి. అయినా ఓకే అనుకుని మద్దతుగా నిలిచింది.ఇక 2019 నుంచి 2024 దాకా తెలుగుదేశం పార్టీ కూడా బీజేపీకి మద్దతు ఇస్తూ వచ్చింది. రాష్ట్రపతి ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇవ్వడమే కాదు కీలకమైన బిల్లులలోనూ మద్దతు ఇస్తూ వచ్చింది. ఆనాడు ఏపీలో టీడీపీని టార్గెట్ చేసి మరీ బీజేపీ ఓడించినా టీడీపీ అదే బీజేపీకి మద్దతుగా నిలిచింది. ఈ వింత రాజకీయం మూలంగానే ఏపీ ప్రయోజనాలు పూర్తిగా పక్కకు పోతున్నాయని అంటున్నారుఏపీలో కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడానికి వైసీపీకి ఏమి అవకాశాలు ఉంటాయని కూడా అంటున్నారు. అయినా సరే గతంలో చంద్రబాబు అనుసరించిన విధానమే ఇపుడు జగన్ అనుసరిస్తారు. ప్రత్యేక హోదా జగన్ అడగలేదు, స్టీల్ ప్లాంట్ జగన్ ప్రైవేట్ పరం చేస్తున్నారు అని బాబు ఆరోపించేవారు.ఈ విషయాలు కేంద్ర పరిధిలో అని తెలిసినా ఆయన బీజేపీని పల్లెత్తు మాట అనేవారు కాదు.ఇపుడు జగన్ అదే చేస్తారు. ప్రత్యేక హోదా విషయంలో మళ్లీ ఆయన గొంతు విప్పుతారు. అలాగే స్టీల్ ప్లాంట్ విషయంలో తప్పు టీడీపీదే అంటారు. ఇలా రెండు పార్టీ ఏపీ గల్లీలో రాజకీయ రచ్చ చేసుకుంటాయి కానీ బీజేపీని పల్లెత్తు మాట అనవు. అదే కేంద్రంలోని బీజేపీ పెద్దలకు కూడా కావాల్సింది.వైసీపీ అవసరం రాజ్యసభలో బీజేపీకి ఉంది అక్కడ ఆ పార్టీకి 11 మంది ఎంపీలు ఉన్నారు. ఎన్డీయేకు పూర్తి బలం లేదు. దాంతో జగన్ ని అలా చేరదీస్తున్నారు అని అంటున్నారు. ఇలా జగన్ తో ఉంటూ బాబుకు అలా బాబుని ఎన్డీయేలో చేర్చుకుని జగన్ కి చెక్ పెడుతూ బీజేపీ కేంద్ర పెద్దలు తమ రాజకీయాన్ని బాగా కొనసాగిస్తున్నారు అని అంటున్నారు.

# ఉద్యోగ,ఉపాధి రంగాల నిర్వీర్యం

న్యూఢిల్లీ,ఇప్పటికే రెండుకోట్ల మందికి ఉపాధి గల్లంతయ్యిందన్న వార్తలు వస్తున్నా అది అంతకు మించి ఉంటుందని అంటున్నారు. దేశంలో నిరుద్యోగానికి తోడు, ఉపాధి అవకాశాలు మందగిస్తున్నాయి. మరోవైపు వస్తూత్పత్తి పెరిగినా..ధరల పోటు తప్పడంలేదు. ఉపాధి దొరక్క నేటికీ వేలాదిమంది విదేశాల బాటు పడుతున్నారు. ఆర్థిక పునరుత్తేజానికి, వృద్ధిరేటును పెంచడానికి నవతరం సంస్కరణలు అవసరమని తెలిపారు. విద్యుత్తు, బ్యాంకింగేతర ఆర్థికసంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల రంగాల సమస్యలు సత్వరం పరిష్కరించాల్సి ఉందని, ప్రైవేటు పెట్టుబడులు పెరిగేందుకు సరికొత్త సంస్కరణలు అవసరమని తెలిపారు. ప్రైవేటురంగ విశ్లేషకుల నుంచి వృద్ధిరేటు అంచనాలు వేర్వేరుగా ఉంటున్నాయని, వీటిల్లో చాలావరకు ప్రభుత్వ అంచనాల కంటే తక్కువగా ఉంటున్నాయని అప్పట్లో పదేపదే రాజన్ గుర్తు చేశారు. దేశంలో ఆటోమొబైల్ రంగ క్షీణత అన్నది నిరుద్యోగాన్ని పెంచే చర్యగా చూడాల్సి ఉంది. కంపెనీలు అమ్మకాలు లేకుండా మూతపడితే నష్టమని గుర్తుంచుకోవాలన్నారు. ఆర్థిక వ్యవస్థ మందగమనం తీవ్ర ఆందోళనకరమని, పరిష్కారానికి నూతన సంస్కరణలు అవసరమని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పూర్వ గవర్నర్ రఘురామ్ రాజన్ అప్పట్లో చేసిన హెచ్చరికలు పట్టించు కోలేదు. మొత్తం మీద ఆర్థిక వ్యవస్థ మందగమనం తీవ్ర ఆందోళనకరమని అన్నారు. వివిధ రంగాలు ఇబ్బంది పడుతున్నా, వాహన రంగం మాత్రం రెండు దశాబ్దాల్లోనే ఎన్నడూ లేనంత సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సంగతి విదితమే. వాహన, అనుబంధ రంగాల్లో వేలసంఖ్యలో ఉద్యోగాలు తొలగిస్తున్నారని, స్థిరాస్తి రంగంలో అమ్ముడు కాకుండా నిర్మాణాలు భారీగా మిగిలిపోతున్నాయని, ఎఫ్‌ఎంసీజీ రంగంలో విక్రయాలు తగ్గుతున్నాయనే ఆందోళనలు పెరుగుతున్నాయి. ఆయా రంగాల నుంచి ఉద్దీపనల కోసం విజ్ఞప్తులు అధికమవుతున్నాయని రాజన్ గుర్తు చేశారు. ప్రస్తుతం కంటే వృద్ధిరేటును మరో 2-3 శాతం పెంచాలంటే, ఏ విధంగా దేశాన్ని ముందుకు నడిపించాలనే విషయంపై అవగాహన ఉండాలి. విద్యుత్తు, ఎన్‌బీఎఫ్‌సీ రంగాల్లో సత్వరం సమస్యలు పరిష్కరించాలి. ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు వచ్చేలా దీర్ఘకాలిక దృక్పథం కలిగిన సంస్కరణలూ కావాలి. ప్రోత్సాహకాలు, ఉద్దీపనలు తాత్కాలికంగా మాత్రమే ఉపకరిస్తాయి. జీడీపీని మనం ఎలా గణిస్తున్నామో, స్వతంత్ర నిపుణుల పర్యవేక్షణ ఉండాలని రాజన్ విశదీకరించారు. గత ఆర్థిక సంక్షోభంతో పోలిస్తే, ప్రస్తుతం అంతర్జాతీయంగా బ్యాంకుల స్థితి బాగానే ఉందని రాజన్ తెలిపారు. 2008లో పరపతి విధానం కీలకమైంది. ఇప్పుడు మెరుగైన విధానం కాదు, ప్రత్యేక విధానం కావాలి. మరో భారీ ఆర్థిక సంక్షోభం వస్తుందని భావించడం లేదని అయితే మన జాగ్రత్తలో మనం ఉండాలన్నారు. కరోనా నేపథ్యంలో అన్ని అంచనాలు తలకిందులు అయ్యాయి. వాటిని గమనంలోకి తీసుకుని ముందుకు సాగాల్సిన సమయమిదని ఆర్థిక వేత్తలు సూచిస్తున్నారు. బ్యాంకింగ్ రంగాన్ని పట్టాలకెక్కించేందుకు అన్ని బ్యాంకులు యత్నిస్తున్నాయి. గృహ,వాహన రుణాలపై వడ్డీలు తడిసి మోపెడు కావడంతో మందగమనం కనిపిస్తోంది. అలాగే కస్టమర్లపై ఎడాపెడా వడ్డింపులకు దూరంగా ఉండాలని నిపుణులు చూస్తున్నారు.. ఇప్పటికే బ్యాంకుల తీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. ఆన్‌లైన్ లావాదేవీలను ప్రోత్సహించాలని చూస్తోంది. యోనో వంటి యాప్‌ల ద్వారా, దేశీయంగా డెబిట్ కార్డుల వినియోగాన్ని తగ్గించగలమనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దేశం మొత్తంమీద దాదాపు 93 కోట్ల డెబిట్, క్రెడిట్‌కార్డులు వినియోగంలో ఉన్నాయని వెల్లడించారు. యోనో యాప్ సాయంతో ఏటీఎంల నుంచి నగదు ఉపసంహరించవచ్చని, కార్డు లేకుండా దుకాణాల్లో చెల్లింపులు పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు.

# విద్యుత్ ఒప్పందాలు...

హైదరాబాద్,కేసీఆర్ హయాంలో తెలంగాణలో అధికారంలో ఉన్న సమయలో యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణాన్ని చేపట్టారు. దాంతో పాటు ఛత్తీస్ ఘడ్ నుండి విద్యుత్ కొనుగోలు చేశారు. అధికధరకు విద్యుత్ కొనుగోలు చేసి అవతవకలకు పాల్పడ్డారని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇందు కోసం జస్టిస్ ఎల్. నరసింహారెడ్డితో జ్యుడిషీయల్ కమిషన్ ను ఏర్పాటు చేస్తూ 2024 మార్చి 14న ప్రభుత్వం జీవోను జారీ చేసింది. అయితే విద్యుత్ కొనుగోలు, విద్యుత్ కేంద్రాలపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి కమిషన్ జీవోను రద్దు చేయాలని కోరుతూ కేసీఆర్ హైకోర్టులో పిటీషన్ వేశారు. దీనికి ముందు కేసీఆర్ ను కమిషన్ ముందు హాజరు కావాలని జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి కమిషన్ లేఖ రాసింది. ఈ నెల 19న కేసీఆర్ కు కమీషన్ నుండి లేఖ అందింది. వారం రోజుల్లోపుగా కమీషన్ ముందు హాజరు కావాలని కోరింది. అయితే జూన్ 25తో వారం రోజుల గడువు పూర్తైంది. దీంతో మరోసారి కమిషన్ నుండి కేసీఆర్ కు లేఖ పంపారు. తన అభిప్రాయాలు చెప్పాలని ఆ లేఖలో కోరారు. కేసీఆర్ తో పాటు అప్పట్లో విద్యుత్ శాఖ మంత్రిగా పనిచేసిన జగదీష్ రెడ్డికి కూడా కమిషన్ లేఖ రాసింది. అయితే అసలు కమిషన్ ఏర్పాటునే బీఆర్ఎస్ నాయకులు తప్పుబడుతున్నారు. విద్యుత్ కొనుగోళ్లు, సరఫరా, ఒప్పందాలు, వివాదాలు అన్నీ విద్యుత్ నియంత్రణ మండలి పరిధిలోనే ఉంటాయని కేసీఆర్ చెబుతున్నారు. జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వ పరిధిలో లేదన్నది బీఆర్ఎస్ వాదన. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ చట్టంలోని 61, 62, 86 సెక్షన్లకు విరుద్దంగా ఈ జీవో ఉందని, ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేస్తూ జారీ చేసిన జీవోను రద్దు చేయాలని హైకోర్టులో కేసీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. ఛత్తీస్ గఢ్ నుండి విద్యుత్ కొనుగోలుకు సంబంధించి అప్పట్లో టీడీపీ ఎమ్మెల్యేగా రేవంత్ రెడ్డి ఈఆర్సీలోనే తన అభ్యంతరాలను వ్యక్తం చేశారని ఈ సంధర్భంగా గుర్తు చేస్తున్నారు. ఛత్తీస్ గఢ్ నుండి విద్యుత్ కొనుగోలు విషయమై జస్టిస్ ఎల్. నరసింహారెడ్డిని విచారణ కమిషన్ నుండి తప్పుకోవాలని కోరుతూ కేసీఆర్ ఈ నెల 15న లేఖ రాశారు. తొమ్మిదిన్నర ఏళ్లలో విద్యుత్ రంగంలో చేసిన కృషిని ప్రస్తావించారు. అప్పట్లో తెలంగాణలో ఉన్న విద్యుత్ కొరతను దృష్టిలో ఉంచుకొని ఛత్తీస్ ఘడ్ ప్రభుత్వంతో పీపీఏ చేసుకున్నట్టుగా వెల్లడించారు. ఛత్తీస్ గఢ్ తో విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని తప్పుబట్టే విధంగా జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి కమిషన్ మాట్లాడడంపై లేఖలో కేసీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. యాదాద్రి పవర్ ప్లాంట్ ను దామరచర్లలో ఏర్పాటు చేయడానికి గల కారణాలను వివరించారు. విచారణ పూర్తి కాకుండానే మీడియా సమావేశంలో తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను తప్పుబట్టేలా జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి మాట్లాడడాన్ని తప్పుపట్టారు. విచారణ కమిషన్ నుండి తప్పుకోవాలని జస్టిస్ ఎల్. నరసింహారెడ్డిని ఆయన కోరారు. ప్రభుత్వాల మధ్య జరిగిన ఒప్పందంలో అవతవకలు ఎలా ఉంటాయని, ఈ లెక్కన అప్పటి చత్తీస్ ఘడ్ కాంగ్రెస్ ముఖ్యమంత్రి రమణ్ సింగ్ కు కూడా నోటీసులు ఇవ్వాలన్నది బీఆర్ఎస్ వాదన. ఈ నేపథ్యంలో కేసీఆర్ పిటీషన్ మీద హైకోర్టు ఎలాంటి ఆదేశాలు ఇస్తుంది అన్నది ఉత్కంఠ రేపుతున్నది.

# స్పీకర్‌పై సమవర్తిలా ప్రవర్తించాలి !

న్యూఢిల్లీ,లోక్‌సభ అంటే దేశ ప్రజలందరిని ప్రతిబించే సభ. ఇది ఏ ఒక్కరిదో కాదు. అధికార పక్షమైనా, విపక్షమైనా అంతా ప్రజల ప్రతినిధులుగా ఎన్నుకోబడి వచ్చినవారే. విపక్షంలో ఉన్న వారైనా తమ నియోజకవర్గ ప్రజలకు ప్రాతినిధ్యం వహించేవారుగా గుర్తించాలి. విపక్షం అంటే గంజిలో ఈగలాగా తీసేసే సంస్కృతి పోవాలి. విపక్షానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి, వారు లేవనెత్తే సమస్యలపై చర్చ చేయాలి. ఇలా ఏ ఒక్క సభ్యుడినైనా తిరస్కారానికి గురి చేయకుండా గౌరవించడం ద్వారా పార్లమెంట్ ఔన్నత్యాన్ని పెంపొందిం చాలి. పార్లమెంట్ అంటే ప్రజల సమస్యలపై చర్చకు వేదిక కావాలి. పరిష్కారానికి దారి చూపాలి. సత్వర నిర్ణయాలు తీసుకోవాలి. తద్వారా ప్రజలకు బాసటగా నిలవాలి. అప్పుడే పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై ప్రజలకు నమ్మిక కుదురుతుంది. ఈ క్రమంలో స్పీకర్ పదవి అన్నది చాల ఉదాత్తమైన పాత్ర పోషించేది. దేశప్రజల సమస్యలను ప్రస్తావించేలా, దానిపై సమగ్రంగా చర్చ జరిగేలా, అలాగే సంప్రదాయాలను పాటించేలా చూడాలి. ఇప్పుడు విపక్ష సభ్యుల సంఖ్య పెరిగినందున గతంలో లాగా బుల్‌డోజ్ వ్యవహారం కుదరదు. అధికార పక్షానికి కొంత తక్కువగా వారికి చేరువలోనే విపక్షం కూడా బలంగానే ఉంది. అందువల్ల సమస్యలను లేవనెత్తినప్పుడు, వాటిపై చర్చ జరిగేలా చూసి, ప్రభుత్వం సంతృప్తికర సమాధానం ఇచ్చేలా చేయడంలో స్పీకర్ కీలక భూమిక పోషించాల్సి ఉంటుంది. ఇది ఇరుపార్టీల మధ్య పోటీ కాదు కనుక చర్చలు చేయడంలో స్పీకర్ ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలి. దేశ ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు విపక్షం ఎప్పుడు సిద్దంగా ఉంటుంది. అవసరమైతే నిలదీస్తుంది. ఈ క్రమంలో స్పీకర్ ధర్మపక్షపాతిగా నిలవాలి. గురుతర బాధ్యతను నిర్వర్తించాలి. దేశంలో లోక్‌సభ స్పీకర్ అనేది ఒక కీలక పదవి. దీని కోసం ప్రతి ఐదేళ్లకోసారి అధికారం, ప్రతిపక్ష నేతల మధ్య పోటీ జరుగుతూనే ఉంటుంది. ఈ క్రమంలోనే స్పీకర్ పదవి కోసం జరిగిన ఎన్నికలో తిరిగి ఓం బిర్లా ఎన్నికయ్యారు. అధికార పక్షానికి చెందిన ఓం బిర్లా కోట నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ప్రతిసారీ ఏకగ్రీవంగా ఎంపిక చేయాలనే లక్ష్యంతో సాగిన పార్లమెంట్ ఇప్పుడు మాత్రం పోటీ ద్వారా స్పీకర్‌ను ఎన్నుకుంది. డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేయగా, బీజేపీ స్పందించలేదు. దీంతో ఆగ్రహించిన ప్రతిపక్షాలు స్పీకర్ పదవి కోసం తమ అభ్యర్థిని నిలబెడుతున్నట్లు ప్రకటించాయి. ఈ క్రమంలో ప్రొటెం స్పీకర్ సభలో ఓటింగ్ నిర్వహించారు. ఎన్డీయేమరోసారి ఓం బిర్లాను అభ్యర్థిగా నిలబెట్టగా, విపక్షాలు కే సురేష్‌ను బరిలోకి దింపాయి. దేశచరిత్రలో స్పీకర్ ఎన్నిక జరగడం ఇది మూడోసారి. లోక్‌సభలోని 542 సీట్లలో, ఎన్‌డిఎకు 293 సీట్లు ఉన్నాయి. విపక్షాలకు సంఖ్యా బలం లేదు. కాబట్టి డిప్యూటీ స్పీకర్ పదవి కూడా ఎన్డీయేకే దక్కే ఛాన్స్ ఉంది. ఈ క్రమంలో ఓం బిర్లా స్పీకర్‌గా మూజువాణి ఓటుతో నెగ్గారు. బిర్లా రెండోసారి స్పీకర్‌గా ఎన్నికైన తొలి బీజేపీ నేతగా చరిత్రకెక్కారు. ఇంతకు ముందు కాంగ్రెస్‌కు చెందిన బలరాం జాఖర్ రెండుసార్లు స్పీకర్‌గా ఉన్నారు. లోక్‌సభలో మొత్తం ఎంపీల సంఖ్య 543. బీజేపీకి 240 మంది ఎంపీలు ఉన్నారు. కాగా ఎన్డీయేకు మొత్తం 293 మంది ఎంపీలు కలరు. టీడీపీ నుంచి 16 మంది, జేడీయూ నుంచి 12 మంది ఎంపీలు ఉన్నారు. ఇండియా కూటమికి 235 మంది ఎంపీలు ఉండగా, వారిలో కాంగ్రెస్‌కు 98 మంది, ఇతరులకు 14 మంది ఉన్నారు. లోక్‌సభలో టీఎంసీకి 29 మంది ఎంపీలు ఉన్నారు. వీరంతా ఆయా ప్రాంతాల ప్రజలకు ప్రతినిధులుగా లోక్‌సభలో అడుగు పెట్టారు. ఈ క్రమంలో అనేక సమస్యలు ఇప్పుడు దేశం ముందున్నాయి. సాధారణంగా విపక్షమే ఈ సమస్యలను ప్రస్తావిస్తుంది.దేశం స్వాతంత్ర్యం సాధించుకుని గర్వంగా 75 ఏళ్లు పూర్తి చేసుకున్న తరుణంలో, కష్టాలు,నష్టాలు భరించి, ఆకలి బాధలను మరచి ప్రజలు దేశం పట్ల తమకున్న భక్తిని చాటు తున్నారు. ఇదే సమయంలో పాలకులు తమ విధానాల్లో, ఆలోచనల్లో మార్పులతో ముందుకు సాగాలి. పటిష్ట భారత నిర్మాణానికి కంకణబద్దులు కావాలి. రాజకీయాలను పక్కన పెట్టి సానుకూలంగా ఆలోచన చేసి ముందుకు సాగాల్సిన సమయమిది. అన్నిరంగాల్లో మనం ముందంజ వేయాల్సిన దశలో ఇంకా దిగుబడులపై ఆధారపడుతూ



ఎగుమతుల విషయంలో లక్ష్యం లేకుండా సాగుతున్నాం. రాజకీయ దృక్కోణంలో కాకుండా అభివృద్ధి కోణంలో పాలన చేయాల్సిన విషయాన్ని పాలకులు వంటబట్టించు కోవాల్సి ఉంది. ఐదేళ్లు అధికారంలోకి రాగానే మరో ఐదేళ్లు గద్దెపై ఉండడ మెలా అన్న ఆలోచన చేయడం వల్లనే భారత్ 75 ఏళ్ల తరవాత కూడా ఇంకా దారిద్యం, నిరక్షరాస్యత, వసతుల కొరత, ఆహారధాన్యాల కొరతతో అలమటిస్తోంది. ఇదంతా పాలకుల దృష్టి లోపంగా చూడాలి. విద్యా,వైద్యరంగం ఎందుకు వెనకబడి ఉందో తెలుసుకోవాలి. పేపర్ లీకేజీల్లాంటివి జరగడం విద్యార్థుల ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఇలాంటి వాటిపై చర్చించి, అక్రమాలను అరికట్టేందుకు పూనుకోవాలి. ఆహార ధాన్యాలను ఇంకా ఎందుకు దిగుమతి చేసుకుంటు న్నామో ఆలోచన చేయాలి. వివిధ రంగాలపై అది చూపిస్తున్న చెడు ప్రభావాన్ని విశ్లేషించు కోవాల్సిన కేంద్రం ప్రభుత్వం ప్రజల కోణంలో ఆలోచించాలి. ఆహారధాన్యాల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఉల్లిపాయలు,కూరగాయల ధరలు దిగిరావడం లేదు. నిత్యవసరాలు అందనంతగా దూసుకు పోతున్నాయి. వంటనూనెలు భగ్గుమంటున్నాయి. మనం చేపట్టిన సంస్కరణలు ఫలితాలు ఇవ్వడం లేదన్న విషయాన్ని పాలకులు గుర్తించడం లేదు. నిజానికి దేశంలో నల్లధనం, అవినీతి పోవాలంటే రాజకీయ పార్టీల నుంచే ప్రక్షాళన మొదలవ్వాలి. నల్లధనం రూపంలో రాజకీయ పార్టీలు విరాళాలు తీసుకుని ఓటర్లను కొనుగోలు చేయడానికి వాడుతున్నాయి. ఎన్నికలు అయ్యాక తగిన మెజారిటీ సమకూరని సందర్భాలలో ఎమ్మెల్యేలు లేదా ఎంపీల బేరసారాల కోసం ఈ నల్లధనాన్నే వాడుతున్నారు. వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు రాజకీయ పార్టీలకు ఇస్తున్న విరాళాలలో అత్యధిక భాగం నల్లడబ్బు రూపంలోనే ఉంటోంది. ఈ పరిస్థితిని నివారించకుండా ఎన్ని సంస్కరణలు చేసినా ఫలితం ఉండదు. ఎన్నికల్లో ఆయా పార్టీలు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న వైనం తాజా ఎన్నికల్లో సైతం చూసాం. ఈ డబ్బుకు లెక్క ఉందో లేదో చెప్పాలి. ఇలా రాజకీయ పార్టీలకు అధికార యావే తప్ప ప్రజలు,దేశ సంక్షేమం కనబడడం లేదు. ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గవర్నర్ వ్యవస్థ ఇలా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం బదులు నానాటికి దిగజారుస్తున్నాయి. ప్రజల డబ్బు నీళ్ల ప్రాయంగా ఖర్చువుతోంది. ముక్కుపిండి వసూలు చేస్తున్న పన్నులను పాలకుల విలాసాలకు ఖర్చు చేసుకుంటున్నారు. వ్యవసాయరంగం కుంగి కృషించి పోతోంది. రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఆహార ధాన్యాలకు మద్దతు ధరలు అందడం లేదు. విద్య మిధ్యగా మారింది. ఉద్యోగాల కల్పన అంతంత మాత్రంగానే ఉంది. రాజకీయాల్లో ఎదుటి పక్షాలను ఢీకొట్టేందుకు తమ తెలివిని ఉపయోగిస్తున్న పాలకులు ప్రజల సమస్యలు పరిష్కరిం చడంలో తగిన శ్రద్ద చూపడం లేదు. ఈదశలో ఇలాంటి ప్రజాస్వామ్యం కొనసాగితే మరో వందేళ్లయినా మన భారత్ రాత మారదు. ప్రజాధనం వృధా ఖర్చులకు కళ్లెం పడాలి. ఇవన్నీ కూడా పార్లమెంట్ వేదికగా చర్చ జరగాలి. విపక్షాలు అమీతుమీ అన్న తీరును పక్కన పెట్టి సమస్యలపై సావధానంగా చర్చించేలా చూసుకోవాలి. విపక్షానికే ఎక్కువ బాధ్యత ఉంటుందని గుర్తించి మసలుకోవాలి. స్పీకర్‌గా ఎన్నికైన ఓంబిర్లా ఇలాంటి సమస్యలపై చర్చకు ఆస్కారం కల్పించాలి. అప్పుడే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం బలోపేతం కాగలదు.

# అత్యతంత కఠిన నియమాలకు ప్రతీక వారాహి దీక్ష



అమరావతి,డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ వేషధారణ, ఆయన ప్రచార రథంపేరు వారాహి కావడంతో ఇప్పుడు వారాహి మాత పేరు మారుమోగిపోతోంది. ఇందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆ అమ్మవారి దీక్షను చేపట్టడం కూడా ఓ కారణంగా చూడాలి. 11 రోజుల పాటు పవన్ వారాహి మాత దీక్షలో ఉన్నారు. ఈ దీక్షలో భాగంగా 11 రోజుల పాటు పవన్ కళ్యాణ్ కేవలం పాలు, పండ్లు, ఇతర ద్రవరూప ఆహారం మాత్రమే తీసుకుంటారు. గతేడాది కూడా జూన్ నెలలో పవన్ వారాహి విజయ యాత్ర చేపట్టారు. ఆ యాత్ర సందర్భంగా వారాహి అమ్మకు పూజలు నిర్వహించారు. అప్పట్లో కూడా వారాహి మాత వార్తల్లో నిలిచారు. కాకపోతే ఈసారి డిప్యూటీ సీఎం హోదాలో పవన్ దీక్ష చేపడుతుండటం విశేషంగా చెప్పుకోవాలి. పవన్ కళ్యాణ్‌కు దైవభక్తి ఎక్కువే అంటారు. ఆయన అందరికి భిన్నంగా వారాహి అమ్మవారిని పూజిస్తారు. ఎన్నికల ముందు కూడా రాష్ట్ర వ్యాప్తంగా యాత్రకు సిద్ధం చేసుకున్న వాహనానికి కూడా వారాహి అని పేరు పెట్టారు. ఏపీ ఎన్నికల్లో ఘన విజయం సాధించటంతో ఈ ఏడాది కూడా వారాహి మాత దీక్షను కంటిన్యూ చేస్తున్నారు. గతంలో కూడా పవన్ చాలా దీక్షలు చేపట్టారు. చాతుర్మాస దీక్ష చేశారు. నాలుగు నెలల పాటు ఈ దీక్షలో పవన్ కొనసాగారు. ఆషాడం, శ్రావణం, భాద్రపదం, ఆశ్వీజం మాసాల్లో పవన్ దీక్ష చేపట్టారు. ఆ దీక్షలో కూడా ఆహార నియమాలు పాటించారు. సాత్వికాహారం మాత్రమే తీసుకునేవారు. దీక్ష విరమించే సమయంలో హోమం కూడా నిర్వహించారు. ఇంతకీ వారాహి మాత దీక్ష ఏమి ఆశించి చేస్తారు? ఎలా చేస్తారు? ఎవరు చేస్తారు? వీటి గురించి తెలుసుకుందాం.. మనో అభీష్టాలను నెరవేర్చే వారాహి అమ్మవారు అత్యంత శుభ ఫలితాలను ఇస్తారు. జూన్ నెలాఖరుతో మొదలై జూలై 9 వరకు అమ్మవారి గుప్త నవరాత్రులు ముగుస్తాయి. ఈ సమయం గురించి ఎక్కువగా ప్రచారంలో లేదు. చాలా తక్కువ మందికి మాత్రమే ఈ విషయం తెలుసు. మన సంప్రదాయంలో ఉన్న నాలుగు నవరాత్రుల్లో అత్యంత మహిమాన్వితమైనవి, శక్తిమంతమైనవి ఈ ఆషాఢ మాస గుప్త నవరాత్రులు. ఎవరైతే ఈ నవ రాత్రులు అత్యంత నిష్ఠతో, శ్రద్ధతో దీక్ష ఆచరిస్తారో వారి సమస్యలన్నీ అమ్మవారి అనుగ్రహంతో తీరిపోతా యనేది పెద్దల విశ్వాసం. సప్తమాతృకలలో వారాహి మాత ఒకరు. ఈమె లలితా పరమేశ్వరి సర్వ సైన్యాధ్య క్షురాలు. మహాలక్ష్మి ప్రతిరూపం, సర్వ మంగళ స్వరూపం. దుష్ట శిక్షణ, శిష్ఠ రక్షణకు అమ్మవారు ఆయుధాలు ధరించి ఉంటారు. చూడటానికి ఉగ్రరూపంగా కనిపించినప్పటికీ ఆమె చాలా కరుణామయి. అయితే వారాహి ఆరాధన అందరూ చేయకూడదన్న అపోహ ఉండటం వల్ల చాలా మందికి వారాహి మాత గురించి పెద్దగా తెలియదు. కానీ ఇది సత్యదూరం.ఎవరైనా వారాహి మాతను పూజించవచ్చు. అరిషడ్వర్గాలు అమ్మ అధీనంలో ఉంటాయి. కామ,క్రోధ, మద, మోహ, మాత్సర్యాల నుంచి అమ్మవారు మనల్ని రక్షిస్తుందని అనుభవజ్ఞుల మాట. మన మనస్సును నియంత్రిస్తుంది. వారాహి మాత భూదేవి నాగలిని, రోకలిని ధరించిన ధాన్య దేవత కూడా. పంటలు సరిగా పండాలన్నా, వ్యవసాయం అనుకూలించాలన్నా ప్రతి రైతు వారాహి మాత ఆరాధన చేయాలని చెబుతారు. వారాహి మాత దీక్ష శ్రద్ధతో చేసిన వారికి వారు కోరుకున్నవన్నీ జరుగుతాయి. భూ సమస్యలు పరిష్కారమవుతాయి. భూ తగాదాలు, కోర్టు కేసులు, శత్రు సమస్యలు, తీవ్ర అనారోగ్య సమస్యలు, జీవితంలో స్థిరత్వం లేకున్నా. మనకు రక్షణ కావాలన్నా, ఇంట్లో తరచూ అశుభాలు జరుగుతున్నా, ఆర్థిక స్థిరత్వం లేకున్నా, అప్పుల బాధల నుంచి విముక్తి పొందాలన్నా వారాహి మాత దీక్ష చేస్తే చాలు ఎలాంటి సమస్య అయినా ఇట్టే పరిష్కారం అయిపోతుందంటారు. వారాహి మాత దీక్ష చేపట్టేవారు రోజూ ఉదయాన్నే లేచి తలస్నానం చేశాక దీక్షా వస్త్రాలు ధరించాలి. అలా వీలు కాని వారు మెడలో దీక్షగా ఒక కండువాను తొమ్మిది రోజుల పాటు ధరించాలి. నిత్యం వారాహి మాత అష్టోత్తర నామాలు, కానీ సహస్ర నామాలు కాని చదువుతూ అమ్మవారికి కుంకుమార్చన చేయాలి. ఎర్రటి పూలతో పూజించాలి. దానిమ్మ గింజలను నైవేద్యంగా పెట్టాలి. దీక్షలో ఉన్నన్ని రోజులు పాదరక్షలు ధరించరాదు. మద్య,మాంసాలకు దూరంగా ఉండాలి, బ్రహ్మచర్యం పాటించాలని, నేలపైనే చాప పరిచి పడుకోవాల్సి ఉంటుందని పండితులు పూజా క్రతువును వివరించారు. ఆచరించటానికి మాత్రం ఇది కాస్త కఠినంగానే ఉంటుంది. అయితే అమ్మవారి అనుగ్రహం పొందటానికి ఈ మాత్రం చేయగలగాలన్న ధృడచిత్తం కావాలి. మన పురాణాల్లోని సప్తమాతృకల్లో వారాహి మాత ధైర్యం, నిర్భయతకు గుర్తుగా చూస్తారు. వారాహి మాతను ధ్యానించడం లేదా ఆరాధించటం ద్వారా సి÷-ది పొందవచ్చని అంటారు.

# పంటలు గిట్టుబాటు కాక ఆందోళన

కడప,ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతులు దళారులచేతుల్లో దగాపడుతున్నా రు. గిట్టుబాటు ధరలు ఉన్నా దళారులు మాత్రం రైతులకు ధరలులేవని మసిపూసి మారేడుకాయ చేస్తున్నారు. దీంతో రైతులు ఉన్న ధరలతోనే సరిపెట్టుకునే దౌర్భాగ్యపు పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులను దళారులు నిలువునా ముంచుతున్నారు. రైల్వేకోడూరులో ప్రధానంగా మామిడి, అరటి, బొప్పాయి తదితర పంటలను సాగుచేస్తున్నారు. ఈఏడాదిలో పకృతివైపరీత్యాలు, చీడపీడలు, దళారులు తదితరవాటితో కోట్లు విలువచేసే అరటి ఏటిపాలుకావడంతో రైల్వేకోడూరు రైతాంగం నిలువునా నష్టపోయింది. అకాల వర్షాలకు కూడా ఉన్నది ఊడ్చుకుపోయిందని వాపోయారు. రైల్వేకోడూరు,ఓబులవారిపల్లె, చిట్వేలి తదితర మండలాల్లో అరటిచెట్లు పడిపోయాయి. అరటిధరలు బాగా ఉన్న సమయంలో ఇటీవల వర్షం కురిసిచెట్లు నేలకూలిపోయాయి. పక్వానికివచ్చిన గెలలు కళ్లముందే పడిపోవడంతో రైతులు విలవిలలాడారు. బొప్పాయి విషయానికి వస్తే ధరలు పూర్తిగా దళారులదే పెత్తనంగా మారింది. ఇకపోతే దళారులు, వ్యాపారులు కుమ్మక్కై ధరలుపెంచలేదు. మరోవైపు రైతులు దళారులతో తీవ్రంగా నష్టపోతున్నారు. అరటి, బొప్పాయి, మామిడికి ధరలు విషయంలో రైతులకు అనుకూలంగా ఉండాలన్నారు.

# ఎదురీది నిలబడ్డ రాహుల్..

న్యూఢిల్లీ,ఒకవైపు కమలం దూకుడు.. మరోవైపు కలిసిరాని కాలం.. రాజకీయ సముద్రంలో పదేళ్ల పాటు ఎదురీదారు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ. పక్కనున్నవారు కూడా తనను నేతగా గుర్తించలేని పరిస్థితి నుంచి..రాహులే మా భవిష్యత్ నాయకుడని..కాబోయే ప్రధాని అని చెప్పుకునే స్థాయిలో నమ్మకం కలిగించారు. హస్తం పార్టీకి గత వైభవాన్ని తీసుకొచ్చేందుకు సుదీర్ఘ పోరాటం చేస్తూనే ఉన్నారు.అవమానాలు, అనుమానాల నుంచి భవిష్యత్ నాయకుడు అనే భరోసా కల్పించే వరకు రాహుల్ రాజకీయ ప్రయాణం ఓ పొలిటికల్ మూవీకి మించిన స్టోరీ. ఫ్యూచర్ లీడర్‌గా పార్టీ శ్రేణుల్లో నమ్మకం కల్పించడంలో సక్సెస్ అవుతున్నారు. ఇన్నాళ్లు కాంగ్రెస్ పార్టీ యువనాయకుడిగా ఉన్న రాహుల్.. ఇక లోక్‌సభలో విపక్ష నేతగా.. ప్రజల తరఫున తన గళం మరింత గట్టిగా వినిపించనున్నారు.

పదేళ్లు కంటిన్యూగా..

పదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్న రాహుల్.. రాజకీయంగా ఎదిగే టైమ్‌లో తీవ్రమైన కష్టాలను చూశారు. ఏ స్థాయిలో అంటే ఉన్నట్లుండి పార్టీ పవర్ నుంచి దిగిపోవడం.. ఒక్కో రాష్ట్రంలో అధికారం చేజారిపోవడం.. నమ్మిన నేతలే నట్టేట ముంచడం.. ఐతే ఏ క్షణంలోనూ తను మాత్రం తలవంచలేదు. 2004లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన రాహుల్.. పూర్తిస్థాయి రాజకీయ ఓనమాలు నేర్చుకునే టైమ్‌లోనే 2014లో కాంగ్రెస్ పవర్‌ను కోల్పోయింది. ఆ తర్వాత అంతా పోరాట బాటే.పదేళ్లు కంటిన్యూగా పార్టీకి అధికారం లేకుండా పోయింది. అధికారమే కాదు ఏకంగా టెన్ ఇయర్స్ ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. ఇక కాంగ్రెస్ పని ఖతమే..మోదీని ఢీకొట్టి నిలబడే సత్తా రాహుల్‌లో లేదన్న ప్రచారం జరిగింది. అతనో పప్పు, రాజీవ్‌గాంధీ లాంటి మాట తీరు లేదు.. సోనియా గాంధీ అంత పట్టుదలతో పనిచేయలేడు.. నాయనమ్మ ఇందిరాగాంధీ అంత డైనమిక్ కాదంటూ ఎన్నో విమర్శలు, ఛీత్కారాలు ఎదుర్కొన్నారు రాహుల్.ఇలా పదేళ్ల పాటు పొలిటికల్ జర్నీలో ఎన్నో సినిమా కష్టాలు చూశారు రాహుల్.. పార్టీకి అధికారం ఉనన్నీ రోజులు పవర్‌ను ఎంజాయ్ చేసి.. అధికారం పోగానే ఒక్కొక్కరు దూరం అయ్యారు. ఏకంగా సీనియర్ కాంగ్రెస్ లీడర్లంతా ఓ కూటమి పెట్టారు. తామే లీడర్లమని..తమను కాదని పార్టీని ఎవరూ నడిపించలేరన్న భ్రమలు కల్పించే ప్రయత్నం చేశారు సీనియర్లు.

ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు

ఆ సమయంలో రాహుల్ పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఓ వైపు బలమైన అధికార పార్టీ..మరోవైపు పార్టీకి వెన్నముక లాగా ఉన్న లీడర్లంతా తలోదారి పట్టడంతో డైలమాలో పడ్డారు రాహుల్. ఆ పరిస్థితి నుంచి నెమ్మదిగా గట్టెక్కి.. యువరక్తాన్ని ప్రోత్సహించడంలో సక్సెస్ అయ్యారు.పార్టీకి వెన్నంటి ఉన్న సీనియర్లకు ప్రాధాన్యం ఇస్తూనే.. కొత్తతరం రాజకీయ నాయకులను ఎంకరేజ్ చేస్తూ వచ్చారు. 2017 నుంచి 2019 వరకు ఏఐసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు రాహుల్. 2019లో పార్టీ ఘోర ఓటమితో పాటు..ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు.. దీంతో అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకున్నారు. తర్వాత కొన్నాళ్ల పాటు సోనియా పార్టీ ప్రెసిడెంట్‌గా కొనసాగారు. ఆ తర్వాత గాంధీ కుటుంబయేతర నేతను కాంగ్రెస్ అధ్యక్షుడ్ని చేయాలనేది రాహుల్ ఆలోచన నుంచే పుట్టింది.కాంగ్రెస్ అంటే వారసత్వం, కుటుంబ పాలన అని బీజేపీ చేసిన విమర్శలను తిప్పి కొట్టేందుకు.. కాంగ్రెస్ సీనియర్ లీడర్‌ను అధ్యక్షుడిగా నియమించాలని ఫిక్స్ అయ్యారు. మొదటగా అశోక్ గెహ్లాట్ పేరును పరిశీలించి..అది కుదరకపోవడంతో మల్లికార్జున ఖర్గేను ఏఐసీసీ చీఫ్‌గా చేయడంలో రాహుల్ గాంధీ కీరోల్ ప్లే చేశారు.భవిష్యత్ లేదనే పరిస్థితి నుంచి పోరాడి నిలిచాడు రాహుల్. దేశవ్యాప్తంగా ఊరూరా పార్టీని నమ్ముకుని.. జెండాను మోస్తున్న ప్రతీ కార్యకర్తకు, నేతకు నమ్మకం కలిగించాడు. సుదీర్ఘ పోరాటం తర్వాత లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా నియమితులు అయ్యారు. ఇండియా కూటమి నేతలు రాహుల్‌ను ఏకగ్రీవంగా విపక్ష నేతగా ఎన్నుకున్నారంటేనే.. అపోజిషన్ విజయంలో ఆయన కష్టమెంతో అర్థం చేసుకోవచ్చు.


పదేళ్ల తర్వాత ప్రధాన ప్రతిపక్ష హోదా

కాంగ్రెస్‌కు పదేళ్ల తర్వాత ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కింది. 2004 నుంచి 2014 వరకూ అధికారంలో కొనసాగింది కాంగ్రెస్ సర్కార్.. 2014, 2019లలో మొత్తం సీట్లలో 10శాతం దక్కించుకోలేకపోవడంతో ప్రతిపక్ష నేత పాత్ర పోషించే అవకాశం రాలేదు. ఈసారి ఆ హోదా దక్కింది.ప్రతిపక్ష నేతలుగా పనిచేసిన ప్రత్యేక రికార్డు రాహుల్ గాంధీతో పాటు, ఆయన తండ్రి రాజీవ్ గాంధీ, తల్లి సోనియా గాంధీకి దక్కినట్లయింది. ఏడు, ఎనిమిది లోక్‌సభలతో పాటు, 16, 17 లోక్‌సభల్లో గుర్తింపు పొందిన ప్రతిపక్ష నేతలెవరూ లేరు.రాహుల్ గాంధీ 2004లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. 2019లో అమేథీ, వయనాడ్ నుంచి పోటీ చేసి..అమేథీలో ఓడిపోయి వయనాడ్‌లో గెలిచారు. 2024లో రాయ్‌బరేలీ, వయనాడ్‌ల నుంచి పోటీ చేసి ఆ రెండు నియోజక వర్గాల్లోనూ విజయం సాధించారు. వయనాడ్‌కు రాజీనామా చేసి.. తన తాత, నాయనమ్మ, అమ్మ ప్రాతినిధ్యం వహించిన రాయ్‌బరేలీ నియోజకవర్గానికి ఎంపీగా కొనసాగుతున్నారు.

### గత ప్రభుత్వం కాగితం ఇచ్చింది తప్ప కాసులు ఇవ్వలే

వికారాబాద్,గత ప్రభుత్వం జిల్లా పరిషత్ భవనం కోసం ఆర్డర్ కాగితం మాత్రమే ఇచ్చిందని నిర్మాణం కోసం డబ్బులు ఇవ్వలేదని తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసన సభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. వికారాబాద్ జిల్లా ప్రజా పరిషత్ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్పీకర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం జిల్లా పరిషత్ భవన నిర్మాణానికి 10 కోట్ల రూపాయలు ఇస్తామని జీవో చేశారు తప్పా.. ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. ఇక, జడ్పీ చైర్ పర్సన్ సునీత మహేందర్ రెడ్డి చొరవతో జిల్లా పరిషత్ ప్రాదేశిక

# అసదుద్దీన్ ఎంపీ పదవి ఊడుతుందా?..




న్యూఢిల్లీ,కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతోపాటు, లోక్ సభ స్థానాలకు గాను ఎన్నికలు నిర్వహించింది. ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అటు కేంద్రంలో మోదీ మూడోసారి హ్యాట్రిక్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు 71 మంది కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇదిలా ఉండగా.. ఇటీవల పార్లమెంట్ లో కొత్తగా ఎన్నికైన ఎంపీల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. దేశంలో ఇటీవల ఎన్నికైన ఎంపీలందరు తమ ప్రమాణ స్వీకారం చేశారు. కొందరు తమ మాతృభాషలో ప్రమాణ స్వీకారంచేశారు.మరికొందరు తమ సాంప్రదాయ వస్త్రాలంకరణలో పార్లమెంట్ కు వచ్చారు. తాము పుట్టిన, పెరిగిన ప్రదేశాలను ప్రతిబింబించేలా పార్లమెంట్ కు వచ్చి, అందరిదృష్టిని తమవైపుకు తిప్పుకున్నారు. కానీ హైదరాబాద్ నుంచి ఎంపీగా ఎన్నికైన మజ్లిస్ నేత అసదుద్దీన్ ఓవైసీ మాత్రం దేశప్రజలు తలదించుకునే విధంగా ప్రవర్తించారు. ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశ.. అసదుద్దీన్ ఓవైసీ.. చివర్లో జై భీమ్, జై తెలంగాణ, జై పాలస్తీనా అంటూ నినాదాలు చేశారు. జై పాలస్తీనా నినాదంపై పార్లమెంట్ లో తీవ్ర వివాదం రాజుకుంది.సభ్యులు వెంటనే వీటిని రికార్డుల నుంచి తొలగించాలని, అసద్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక దేశంలోని అత్యున్నతమైన పార్లమెంట్ లో.. ఇతర దేశాలను పొగడటం ప్రస్తుతం వివాదాస్పదంగా మారింది. అసద్ పై చర్యలు తీసుకోవాలని కమలం పార్టీ నేతలు స్పీకర్కు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. మరోవైపు.. ఈ ఘటనపై కొందరు న్యాయవాదులు.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కూడా ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే అసదుద్దీన్ చేసిన నినాదంపై లోక్ సభలో కొద్దిసేపు తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో.. అసదుద్దీన్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తామని ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ ప్రకటించారు. అదే విధంగా పలువురు బీజేపీ శ్రేణులు,లాయర్లు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 102 (డీ) ప్రకారం అసదుద్దీన్ ఓవైసీపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు.సుప్రీంకోర్టు న్యాయవాది అలోక్ శ్రీవాస్తవ, సీనియర్ లాయర్ విష్ణు శంకర్ జైన్ లు కూడా దీన్ని తీవ్రంగా పరిగణించారు. రాష్ట్రపతికి ద్రౌపది ముర్ముకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. పాలస్తీనాకు అనుకూలంగా అసదుద్దీన్ చేసిన నినాదాలపై ఫిర్యాదులు అందినట్టు వెల్లడించారు. ప్రస్తుతం భారత్ కు ఇతర దేశాలతో సఖ్యత ఉందని, కానీ పాలస్తీనా అనుకూల నినాదాలు, అది కూడా, భారత పార్లమెంట్ లో నినాదాలు చేయడంపై పరిశీలిస్తున్నామని చెప్పారు.

ఆర్టికల్ 102 (డీ) ప్రకారం..

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 102 లో.. పార్లమెంటు సభ్యుల అనర్హత, విధి విధానాలను వెల్లడిస్తుంది. చట్టసభల్లోని సభ్యులు ఎవరైనా.. భారత పౌరులు అయినా కాకున్నప్పటికీ.. స్వచ్ఛందంగా వాళ్లే విదేశీ పౌరసత్వాన్ని పొందినా లేక ఏదైనా వేరే దేశానికి విధేయతను డైరెక్ట్ గా లేదా ఇన్ డైరెక్ట్ గా ప్రకటించినా.. ఆ సభ్యుడిపై వేటు వేయవచ్చని ఆర్టికల్ 102 లోని క్లాజ్ డీ చెబుతోంది. ఈ నేపథ్యంలో ఎంపీ అసద్ ను వెంటనే చర్యలు తీసుకోవాలంటూ పలువురు మేధావులు, లాయర్లు, బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. అసద్ ప్రవర్తించిన తీరు దేశ సార్వభౌమాధికారానికి భంగం కల్గించడమే అంటూ రాజకీయ మేధావులు వ్యాఖ్యలు చేస్తున్నారు.

# రాజీకి వచ్చిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



న్యూఢిల్లీ,కాంగ్రెస్ లో జీవన్ రెడ్డి వివాదం సద్దుమణిగింది. సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి గురువారం ఉదయం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వెళ్లారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి నివాసంలో బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ జరిగింది. ఈ భేటీకి మంత్రి శ్రీధర్ బాబు కూడా హాజరయ్యారు. బుధవారం ఢిల్లీలో ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ ను జీవన్ రెడ్డి కలిశారు. అధిష్టానం జోక్యంతో జీవన్ రెడ్డి తన రాజీనామా విషయంలో వెనక్కి తగ్గారు. సీఎం రేవంత్ తో చర్చించిన తరువాత చల్లబడ్డారు. ఈ క్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, శాసన సభ్యులు అడ్లూరి లక్ష్మణ్ ఢిల్లీ నుంచి హైదరాబాద్ కు బయలుదేరారు. కాగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వీడడం ఖాయమన్న వార్తలకు ఫుల్‌స్టాప్ పడింది. తనకు సమాచారం ఇవ్వకుండానే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని తీవ్ర మనస్తాపం చెందిన జీవన్‌రెడ్డి ఎట్టకేలకు మెట్టు దిగారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నవాళ్ల అభిప్రాయాల ఆధారంగానే చేరికలు, ఇతర విషయాలలో ముందుకెళతామని అధిష్టానం హామీ ఇవ్వడంతో ఆయన శాంతించారు. రంగంలోకి దిగిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పరిస్థితిని చక్కబెట్టారు. మూడ్రోజులుగా అసంతృప్తితో రగిలిపోతూ పార్టీని వీడేందుకు సిద్ధపడిన జీవన్‌రెడ్డికి పార్టీ అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. కేసీ వేణుగోపాల్ ఫోన్ చేసి ఢిల్లీ రావాలని కోరడంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి బుధవారం సాయంత్రం జీవన్ రెడ్డి ఢిల్లీ చేరుకున్నారు. తెలంగాణ భవన్‌లోని శబరి బ్లాక్‌లో జీవన్‌రెడ్డితో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అరగంటపాటు చర్చలు జరిపారు. అయినా జీవన్‌రెడ్డి వెనక్కి తగ్గలేదు. తర్వాత ముగ్గురూ కలిసి కేసీ వేణు గోపాల్ ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌లోకి వెళ్లినా తాను పార్టీని నమ్ముకుని ఉన్నానని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి చెప్పినట్టు తెలిసింది. కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే సంజయ్ చేరికపై అసంతృప్తి వ్యక్తం చేశారని సమాచారం. జీవన్‌రెడ్డిని బుజ్జగించిన పెద్దలు.. పార్టీ అండగా ఉంటుందని, దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పు?ంజుకుంటున్న సమయంలో పార్టీని వీడవద్దని కోరినట్టు తెలిసింది. దీంతో చల్లబడిన జీవన్‌రెడ్డి సమ్మతించారు. భేటీ అనంతరం బయటికి వచ్చిన జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తనకు కాంగ్రెస్సే ముఖ్యమంటూ వెల్లడించారు. కార్యకర్తలను కాపాడుకోవడం ఏ పార్టీకైనా ముఖ్యమని అన్నారు. కార్యకర్తల ఆత్మగౌరవాన్ని దృష్టిలో పెట్టుకుని, వారి ఆలోచనలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్?కు మెరుగైన ఫలితాలు వచ్చాయని, లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, జాతి ఐక్యతను కాంగ్రెస్ కాపాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ నెరవేరుస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలుకాని పథకాలను తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఏకకాలంలో రూ.31 వేల కోట్లతో రుణమాఫీకి కాంగ్రెస్ సంకల్పించిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.


# తలుపులు తెరిచే ఉంటాయ్ - ఎవరైనా రావొచ్చు?'

హైదరాబాద్,రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాల దృష్ట్యా చేరికలు ఆగవని కాంగ్రెస్ అధిష్ఠానం స్పష్టం చేసింది. పార్టీని అంటిపెట్టుకుని ఉన్న సీనియర్ నాయకులు, కార్యకర్తల గౌరవ మర్యాదలు తక్కువ కాకుండా చూసుకుంటామని ప్రకటించింది. పీసీసీ నూతన అధ్యక్షుడి ఎంపిక, మంత్రివర్గ మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు దిల్లీ పర్యటనలో పార్టీ పెద్దలతో చర్చించినట్లు తెలుస్తోంది.జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ చేరికతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తీవ్ర మనస్తాపానికి గురవ్వడంతో నేతల చేరికలకు కాంగ్రెస్ విరామం ప్రకటిస్తుందనే ప్రచారం జరిగింది. కానీ జీవన్‌రెడ్డిని దిల్లీకి పిలిపించుకుని బుజ్జగించిన ఏఐసీసీ, చేరికలు కొనసాగుతాయని స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. ఇందుకు అనుగుణంగా వివాదాలు పునరావృతం కాకుండా ఏకాభిప్రాయంతో చేరికలు కొనసాగించేందుకు రాష్ట్ర నాయకత్వం సిద్ధమైంది. తెలంగాణలో నేతల చేరికలకు తలుపులు తెరిచే ఉంటాయని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జీ దీపా దాస్‌మున్షీ స్పష్టం చేశారు. పార్టీలో చేరేందుకు వచ్చేవారిని వెనక్కి పంపించలేము కదా? అని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. కాంగ్రెస్‌లో ఎమ్మెల్యేల చేరికలపై విమర్శలు చేసేవారు గతంలో ఏం చేశారో వెనక్కి తిరిగి చూసుకోవాలని బీఆర్ఎస్?ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. “కాంగ్రెస్ పార్టీ తలుపులు అందరి కోసం తెరిచే ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం ఉంచి పార్టీలో చేరాలనుకునే ఎమ్మెల్యే కోసం దర్వాజలు తెరిచే ఉంటాయి. ఇదే సమయంలో మా పార్టీ నాయకుల మనోభావాలు ఏ విధంగానూ దెబ్బతీయం. వారిని కలుపుకొని ముందుకెళ్తాం. కాంగ్రెస్ పార్టీలో ఇంతకుముందు చాలామంది చేరారు. ఇకపై కూడా చాలామంది వచ్చి చేరుతారు. ఎందుకంటే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చాలా బలంగా ఉంది”- దీపా దాస్‌మున్షీ, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జిఅటు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రుల దిల్లీ పర్యటనలో పీసీసీ అధ్యక్షుడి ఎంపిక కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. పీసీసీ చీఫ్‌గా ఎవరిని నియమించాలి? ఏ సామాజిక వర్గానికి అవకాశం ఇవ్వాలి? అనే విషయాలపై సమాలోచనలు జరిగినట్లు తెలుస్తోంది. మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు మధుయాస్కి, సంపత్ కుమార్, బలరాం నాయక్, సురేష్ షెట్కార్, అంజన్ కుమార్ యాదవ్ తదితరులతోపాటు పలువురు మంత్రుల పేర్లు కూడా తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది.పీసీసీ అధ్యక్షుడి ఎంపికపై కాంగ్రెస్ కసరత్తు : ఐతే మంత్రులుగా ఉన్నవారు పార్టీని సమర్థంగా నడిపేందుకు అవకాశం ఉండదన్న భావనకు ఏఐసీసీ వచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సమర్థవంతంగా పార్టీకి సేవలు అందించడంతోపాటు ప్రభుత్వానికి వెన్నుదన్నుగా ఉంటూ ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొడుతూ ముందుకు వెళ్లే నాయకత్వం కావాలని యోచిస్తున్నారు. దీనిపై రేవంత్ రెడ్డితో పాటు దీపా దాస్‌మున్షీ సహా మంత్రులు భట్టి



విక్రమార్క, ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్ బాబు లాంటి సీనియర్లతో చర్చించిన తర్వాతే ఏఐసీసీ నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది.పీసీసీపై నిర్ణయం అధిష్ఠానమే తీసుకుంటుంది : పీసీసీ పదవీకాలం ముగింపు అంటూ ఏమీ లేదన్న దీపా దాస్‌మున్షీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ‘పీసీసీ పదవీకాలం పూర్తవుతుందనే మాట ఎందుకు వస్తుందో నాకు అర్థం కావడం లేదు. పీసీసీ పదవీకాలం ఎప్పుడు పూర్తవుతుంది? ఎప్పుడు మొదలవుతుందనేది పార్టీ నిర్ణయం. పీసీసీపై నిర్ణయం అధిష్ఠానమే తీసుకుంటుంది. శాసనసభ, లోక్‌సభ తరహాలో ఐదేళ్ల తర్వాత మార్పు చేయాలనే విధానం లేదు’ అని దీపాదాస్ మున్షీ తెలిపారు.మంత్రివర్గ విస్తరణపై కూడా కాంగ్రెస్ పెద్దల వద్ద చర్చకు వచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుత మంత్రివర్గంలో ఏ సామాజిక వర్గాల వారు ఉన్నారు? ఏ జిల్లాలకు ప్రాతినిధ్యం లేదు? పార్టీ బలోపేతం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ఆరుగురిని ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు పీసీసీ వర్గాలు చెబుతున్నాయి. డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్ పదవిపైనా స్పష్టత రాలేదు. ఆరు మంత్రిత్వ శాఖల్లో రెండు రెడ్డి, రెండు బీసీ, ఒకటి ఎస్టీ, మరొకటి మైనార్టీ లేదా ఎస్సీ సామాజిక వర్గాలకు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గంలో బెర్త్‌కోసం నాయకులు పెద్ద సంఖ్యలో పోటీపడుతున్నారు.నామినేటెడ్ పదవుల విషయంలో : ప్రభుత్వం ప్రకటించిన 37 మంది నామినేటెడ్ పదవుల్లో కొందరి నియామకంపై మంత్రులు, ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై కూడా దిల్లీలో చర్చకు వచ్చినట్లు సమాచారం. ఈ 37 మందిని కొనసాగించాలని రాష్ట్ర నాయకత్వం యోచిస్తున్నప్పటికీ తమకు తెలియకుండానే నియమించిన వారిని తొలగించి ప్రత్యామ్నాయ నియామకాలు చేపట్టాలని కొంతమంది మంత్రులు డిమాండ్ చేస్తున్నారు. ఐతే ఏదో విధంగా సర్ది చెప్పి ఆ 37 మంది నామినేట్ పదవుల పేర్లను అధికారికంగా ప్రకటించి జీఓలు ఇచ్చేందుకు రాష్ట్ర నాయకత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

# నిలకడగా అద్వానీ ఆరోగ్యం




న్యూఢిల్లీ,బీజేపీ అగ్రనేత, మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని ఎయిమ్స్ ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఆయన్ని వైద్యులు నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపాయి. ప్రస్తుతం అద్వానీ వయసు 96 ఏళ్లు. వయో సంబంధిత అనారోగ్య సమస్యలతోనే ఆయనను ఆస్పత్రిలో చేర్చినట్టు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. మూడు నెలల కిందటే కేంద్ర ప్రభుత్వం అద్వానీకి దేశ అత్యున్నత పురస్కారం భారతరత్నను ప్రదానం చేసిన విషయం తెలిసిందే. వృద్ధాప్య సంబంధ సమస్యలతో బాధపడుతున్న అద్వానీ రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ అవార్డుల కార్యక్రమానికి హాజరుకాలేకపోయారు. దీంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్వయంగా అద్వానీ నివాసానికి వెళ్లి పురస్కారాన్ని అందించారు. మాజీ ఉప ప్రధాని, బీజేపీ సీనియర్ నేత లాల్ కృష్ణ అద్వానీ ఆరోగ్యం క్షీణించడంతో ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేర్పించారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయనను బుధవారం రాత్రి 10.30 గంటలకు ఎయిమ్స్‌లో చేర్చారు. అద్వానీకి యూరాలజీకి సంబంధించిన సమస్యలు ఉన్నాయి. యూరాలజీ ప్రొఫెసర్ డాక్టర్ అమలేష్ సేథ్ ఆధ్వర్యంలో ఆయన చికిత్స పొందుతున్నారు. అద్వానీ మెడికల్ బులెటిన్‌ను ఎయిమ్స్ వైద్యులు, వైద్య నిపుణులు త్వరలో విడుదల చేయనున్నారు. ఎల్‌కే అద్వానీ దేశ అత్యున్నత పౌర గౌరవ పురస్కారమైన భారతరత్నను ఈ ఏడాది 2024లోనే స్వీకరించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎల్‌కే అద్వానీ నివాసానికి వెళ్లి భారతరత్నతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా పాల్గొన్నారు. అద్వానీ ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఆయన నివాసంలోనే ఆయనకు భారతరత్నను ప్రదానం చేశారు. ఎల్‌కే అద్వానీ 1927 నవంబర్ 8న అవిభాజ్య భారతదేశంలో, ప్రస్తుత పాకిస్థాన్‌లోని కరాచీలో జన్మించారు. సెప్టెంబర్ 12, 1947న పాకిస్థాన్‌ను విడిచిపెట్టి అతని కుటుంబం భారతదేశానికి వచ్చిందని ఆయన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. లాల్ కృష్ణ అద్వానీకి ఒక కుమార్తె ప్రతిభా అద్వానీ, కుమారుడు జయంత్ అద్వానీ ఉన్నారు. అద్వానీ కొడుకు, కుతురు ఇద్దరూ రాజకీయాలకు దూరంగా ఉన్నారు. కరాచీలోని సెయింట్ పాట్రిక్స్ స్కూల్ నుంచి తన ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. విభజన తర్వాత భారతదేశంలోని ముంబైలోని ప్రభుత్వ న్యాయ కళాశాల నుంచి న్యాయ పట్టా అందుకున్నారు. అద్వానీ ఫిబ్రవరి 25, 1965న కమల అద్వానీని వివాహం చేసుకున్నారు. అద్వానీ దేశభక్తి కారణంగా ఆర్ఎస్ఎస్ వైపు మొగ్గు చూపారు. 1947లో దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పుడు, లాల్ కృష్ణ అద్వానీ ఈ స్వాతంత్ర్య వేడుకలను జరుపుకోలేకపోయారు. ఎందుకంటే అప్పుడు ఆయన పాకిస్తాన్‌లో ఉన్నారు. దేశ విభజన తర్వాత కరాచీ నుంచి ఢిల్లీకి వచ్చి రాజస్థాన్‌లో సంఘ్ ప్రచారానికి శ్రీకారం చుట్టారు. సంఘ్ ప్రచారక్‌గా చాలా కాలం పనిచేశారు. 1947 నుంచి 1951 వరకు కరాచీ శాఖ ఖా కార్యదర్శిగా, భరత్‌పూర్, అల్వార్, బుండి, కోట, ఝులావర్‌లలో ఖా కార్యక్రమాలను నిర్వహించారు.లాల్ కృష్ణ అద్వానీ రాజకీయ ప్రయాణం గురించి మాట్లాడుకుంటే 1951లో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జన్ సంఘ్ స్థాపించినప్పుడు, 1957 వరకు అద్వానీ పార్టీ కార్యదర్శిగా ఉన్నారు. ఆ తర్వాత 1973 నుంచి 1977 వరకు జన్ సంఘ్ అధ్యక్షుడిగా పనిచేశారు. 1980లో భారతీయ జనతా పార్టీ స్థాపించినప్పుడు, ఆయన దాని వ్యవస్థాపక సభ్యుడిగా ఉన్నారు. అద్వానీ 1980 నుంచి 1986 వరకు బీజేపీ ప్రధాన కార్యదర్శిగా, 1986 నుంచి 1991 వరకు బీజేపీ అధ్యక్షుడిగా వర్క్ చేశారు. అద్వానీ మూడుసార్లు బీజేపీ అధ్యక్షుడిగా, 5 సార్లు లోక్‌సభ ఎంపీగా, 4 సార్లు రాజ్యసభ ఎంపీగా పనిచేశారు. 1977 నుంచి 1979 వరకు తొలిసారిగా కేంద్రంలో మంత్రిగా పనిచేశారు. ఆ కాలంలో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ బాధ్యతలు చేపట్టారు. రాజకీయాల్లో 'యాత్రల' సంస్కృతికి నాంది పలికిన నాయకుడు లాల్ కృష్ణ అద్వానీ. అయోధ్యలో రామమందిరానికి డిమాండ్ ఉధృతంగా ఉన్న సమయంలో, లాల్ కృష్ణ అద్వానీ గుజరాత్‌లోని సోమనాథ్ నుంచి అయోధ్య వరకు రథయాత్ర ప్రారంభించారు. దీని కారణంగా దేశ రాజకీయాల్లో హిందూత్వ రాజకీయాలు ఉద్భవించాయి. కానీ బీహార్‌లో అప్పటి ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ ఆయనను సమస్తిపూర్‌లో అరెస్టు చేశారు. ఈ సంఘటన తర్వాత అద్వానీ రాజకీయాల్లో హీరోగా ఎదిగారు.

## పెద్దిరెడ్డి అరాచకాలతో విసిగిపోయాం

తిరుపతి,గత 25 సంవత్సరాలుగా పెద్దిరెడ్డి కుటుంబ పాలనతో విసిగిపోయామని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. జిల్లా మొత్తాన్ని పెద్దిరెడ్డి కుటుంబం తమ గుప్పెట్లో పెట్టుకుని నియంతలా వ్యవహరించారన్నారు. పుంగనూరు మున్సిపల్ చైర్మన్ హలీం భాషాతో పాటు కౌన్సిలర్లు అభివృద్ధి కోసం పోరాటం చేసినా పెద్దిరెడ్డి నియంత పోకడల ముందు ఏమి చేయలేక పోయారన్నారు. ఎంపీ మిథున్ ఊరికో మాట మాట్లాడుతున్నారన్నారు. నిన్నటి దాకా బీజేపీని రాష్ట్రంలో ఎన్డీఏ కూటమిని మిథున్ రెడ్డి తీవ్రంగా విమర్శించారన్నారు. పార్లమెంట్‌లో బీజేపీకి మద్దతు ప్రకటించడాన్ని ఎలా చూడాలని చల్లా రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. అబ్బా కొడుకుల నాటకాలను ప్రజలు గమనిస్తున్నా రన్నారు. ఇక మీ ఆటలు సాగనివ్వబోమన్నారు. మీ అవినీతి చిట్టా త్వరలోనే విప్పుతామన్నారు. తప్పుడు కేసులతో సామాన్యుని హింసించటాన్ని ఎవరూ క్షమించే పరిస్థితిలో లేరని చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. చల్లా ఆధ్వర్యంలో పుంగనూరు మున్సిపల్ చైర్మన్ అలీమ్ భాషాతో పాటు 12 మంది మున్సిపల్ కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. ఈ నేపథ్యంలోనే పుంగనూరు మున్సిపల్ కార్యాలయంపై టీడీపీ జెండా రెపరెపలాడ నుంది. చల్లా రామచంద్రారెడ్డి వ్యూహం విజయవంతమైంది.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ .. విచారణను వచ్చే నెలకు వాయిదా వేసిన హైకోర్టు



హైదరాబాద్,బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని దాఖలైన పిటిషన్‌పై నేడు హైకోర్టులో విచారణ నిర్వహించారు. జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి ఈ పిటిషన్‌పై మరోసారి విచారించారు. దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరిలు భారత రాష్ట్ర సమితి నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ ముగ్గురిని అనర్హులుగా ప్రకటించాలంటూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్, హుజూరాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు.పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సుందరన్ వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ఒక పార్టీ గుర్తుపై గెలిచి, మరో పార్టీలోకి వెళ్లడం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమని, ఇలాంటి ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసిన 3 నెలల్లో అనర్హతా వేటు వేయాలని సుప్రీంకోర్టు తీర్పులున్నాయని ఆయన కోర్టుకు తెలిపారు. రాజీనామా చేయకుండా పార్టీ మారడం చట్ట విరుద్ధమన్నారు. ఈ విషయంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌కు ఫిర్యాదు చేసి 3 నెలలు గడిచినా కనీసం నోటీసులు కూడా జారీ చేయలేదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. పైగా స్పీకర్ తరఫున అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన కౌంటర్‌లోనూ వివరాలు సరిగ్గా లేవని తెలిపారు. వాదనలు విన్న న్యాయస్థానం, విచారణను వచ్చే నెల 3వ తేదీకి వాయిదా వేసింది.ఎమ్మెల్యేల వరుస పార్టీ ఫిరాయింపులు – సుప్రీంకోర్టును ఆశ్రయించనున్న బీఆర్?ఎస్?అనర్హతా పిటిషన్ మంత్రం : నేతల వలసలు భారత రాష్ట్ర సమితి పార్టీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. నేతలు ఒక్కొక్కరుగా పార్టీకి గుడ్ బై చెబుతుండటం గులాబీ పార్టీకి సవాలుగా మారుతోంది. ఈ నేపథ్యంలో రాజ్యాంగబద్ధంగా ఉన్న అవకాశాన్ని వినియోగించుకోవడం ద్వారా ఎమ్మెల్యేల వలసలకు అడ్డుకట్ట వేయాలని బీఆర్ఎస్ అధినాయకత్వం భావిస్తోంది. చట్టపరంగా అనర్హత వేటు పడేలా చూడటం ద్వారా ఇతర శాసనసభ్యులు పార్టీని వీడకుండా కట్టడి చేయవచ్చన్నది ఆ పార్టీ ఆలోచన.అందులో భాగంగానే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరిలపై అనర్హత పిటిషన్ దాఖలు చేశారు. వీరితో పాటు భవిష్యత్తులో ఇంకెవరైనా పార్టీని వీడినా, ఏ మాత్రం ఆలస్యం చేయకుండా అనర్హతా పిటిషన్ దాఖలు చేయాలని పార్టీ అధిష్ఠానం ఇప్పటికే నేతలకు స్పష్టం చేసింది. ఇద్దరు ఎమ్మెల్సీలపై కూడా ఛైర్మన్‌కు ఇప్పటికే ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్‌లో చేరిన రాజ్యసభ సభ్యుడు కేశవరావు అవసరమైతే సభ్యత్వానికి రాజీనామా చేస్తానని ప్రకటించారు.

# మరో చరిత్ర దిశగా ఇస్రో.. ఈ సారి భిన్నంగా చంద్రయాన్-4..!

హైదరాబాద్,చంద్రయాన్-4 భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ మరోసారి చరిత్ర సృష్టించేందుకు సిద్ధమవుతోంది. ముందెన్నడూ లేనివిధంగా ఇస్రో ఈసారి కొత్తగా చంద్రయాన్-4 మిషన్‌కు సిద్ధమవుతోంది. 2026 నాటికి ఈ మిషన్ మొదలుకానున్నది. మిషన్‌కు సంబంధించిన కీలక వివరాలను ఇస్రో చీఫ్ సోమ్‌నాథ్ ఏర్పాటు చేశారు. చంద్రయాన్- రెండు భాగాలు ప్రయోగించబడ్డాయి. రెండు భాగాలను ప్రారంభించిన తర్వాత వాటిని అంతరిక్షంలోనే అనుసంధానం చేస్తామన్నారు. ఈ విజయవంతమైతే ఈ ఘనత సాధించిన తొలి దేశంగా భారత్ నిలువనున్నది. చంద్రయాన్-4 ల్యాండర్‌ను ఇస్రో నిర్మిస్తుండగా.. రోవర్‌ను జపాన్‌లో సిద్ధం చేస్తోంది. చంద్రయాన్-4 చంద్రుడి శివశక్తి పాయింట్ వద్ద ల్యాండ్ భూమి.ఇక్కడి నుంచే చంద్రుడి మిషన్‌పై మనట్టిని సేకరించి తిరిగి భూమిపైకి తీసుకువచ్చింది. అయితే, తొలిసారిగా అంతరిక్షంలోనే స్పేస్ షటిల్ నిర్మించబడింది. అంతరిక్షంలోనే శాటిలైట్ నిర్మించడం భారత్ చంద్రుడిపై దిగకముందే భారత్ చరిత్ర సృష్టిస్తోంది. చంద్రయాన్-4కు ఈ సారి ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామన్నారు. చంద్రుడిపై ఎలాంటి నమూనాలను తీసుకురావాలనేది లక్ష్యమని. ఈ ప్రయత్నంలోనే స్పేస్‌లో డాకింగ్ చేయాలని ఇస్రో నిర్ణయించినట్లు.



మిషన్‌కు సంబంధించిన ప్రతిపాదనలను ఆమోదం కోసం కేంద్రానికి పంపినట్లు ఇస్రో చీఫ్ తెలిపారు. ఇస్రో విజన్ 2024లో చేరిన నాలుగు ప్రాజెక్టుల్లో ఇది ఒకటి అని చెప్పారు. ఇందులో 2035 నాటికి భారత్‌కు సొంత స్పేస్‌స్టేషన్ నిర్మించడం, 2040 నాటికి మానవులను చంద్రుడిపైకి పంపే ప్రణాళిక కూడా ఉంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com